


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 85 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 18 డిసెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-



## పీపీపీ విధానంలోనే

# ప్రభుత్వ వైద్య కళాశాలలు నిర్మిస్తున్నాం...

★ ప్రభుత్వమే నిబంధనలు పెడుతుంది... ప్రభుత్వమే నిర్దేశిస్తుంది ★ పీపీపీ పద్ధతిన రోడ్ల నిర్మాణం చేపడితే... ప్రైవేట్ రోడ్లు అవుతాయా? ★ విమర్శలు చేస్తే భయపడం.. ప్రజలకు వాస్తవాలు చెబుతాం.. ★ 5వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** పీపీపీ పద్ధతిన నిర్మిస్తున్న మెడికల్ కాలేజీలపై జరుగుతున్న దుష్ప్రచారంపై సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టత ఇచ్చారు. పీపీపీ పద్ధతిలో మెడికల్ కాలేజీలను నిర్మిస్తున్నా... అవి ప్రభుత్వ కాలేజీల పేరుతోనే నడుస్తాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బుధవారం 5వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు మెడికల్ కాలేజీల నిర్మాణంపై స్పందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మిగతా .. 2లో..

## శీతాకాల విడిది కోసం హైదరాబాద్ చేరుకున్న

# రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** శీతాకాలం విడిది కోసం రాష్ట్ర పతి ద్రౌపదీ ముర్ము హైదరాబాద్ చేరుకున్నారు. హకీంపేటలోని ఎయిర్ ఫోర్స్ శిక్షణ కేంద్రానికి ప్రత్యేక విమానం ద్వారా చేరుకున్న ఆమెకు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు స్వాగతం పలికారు. 18న నిలయంలో విశ్రాంతి తీసుకుంటారు. 19న రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు హాజరవుతారు. 20న గచ్చిబౌలిలో బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో పాల్గొంటారు. 21న నిలయంలో నిర్వహించే పౌరుల భేటీ, ఎట్ హోమ్‌లో పాల్గొంటారు. 22న సాయంత్రం ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరుతారు.

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో

# ఏపీ భాజపా నేతల భేటీ



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఏపీ భాజపా నేతలు భేటీ అయ్యారు. కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీని వాసవర్మ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆయన్ను కలిశారు. సుమారు 20 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. ఏపీలో ప్రభుత్వ కార్యక్రమాల అమలు, అటల్ సందేశ్ యాత్ర వివరాలను నేతలు.. అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు. యాత్రలో తెదేపా, జనసేన నేతలు పాల్గొంటున్న విష యాన్ని తెలపగా.. మంచి పరిణామమని ఆయన కితాబిచ్చినట్లు నేతలు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వివరాలను భాజపా నేతలు అమిత్‌షాకు అందజేశారు.

# 'పల్లె' జీవనానికి బలమైన పునాది

## కలెక్టర్ చదలవాడ నాగరాణి నాయకత్వంలో పశ్చిమ గోదావరిలో వినూత్న గ్రామీణ ప్రగతి



**భీమవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్లె ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం, రైతులకు గిట్టుబాటు ధర, మహిళలకు స్వావలంబను ఈ మూడు లక్ష్యాలను సమన్వయంగా సాధించే దిశగా పశ్చిమ గోదావరి జిల్లా ముందంజలో నిలుస్తోంది. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టమైన దృష్టి, కఠినమైన పర్యవేక్షణతో అమలవుతున్న కార్యక్రమాలు గ్రామీణాభివృద్ధికి దిశానిర్దేశం చేస్తున్నాయి. ప్రజల అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకుని విధానాలను రూపకల్పన చేయడమే ఈ విజయాలకు మూలమని అధికారులు చెబుతున్నారు.

**సహజ సాగుకు గిట్టుబాటు ధర - సహజ ఆహార విక్రయ కేంద్రాలు**

సహజ వ్యవసాయం చేపడుతున్న రైతులు మార్కెట్ ధరల హెచ్చుతగ్గులతో నష్టపోతున్న మిగతా .. 2లో..

# పర్యాటక రంగంలో సరికొత్త అధ్యాయం

## అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా(ఏడీటీవోఐ)తో పర్యాటక శాఖ ఎంవోయూ

## 2026 ఫిబ్రవరి 13, 14 తేదీల్లో విశాఖలో "ఏడీటీవోఐ నేషనల్ టూరిజం మార్ట్ 2025" నిర్వహణ

## రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని దేశీయంగా అగ్రస్థానంలో నిలబెట్టే దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా సహకారంతో 2026 ఫిబ్రవరి 13, 14 తేదీల్లో విశాఖపట్నం వేదికగా 'ఏడీటీవోఐ నేషనల్ టూరిజం మార్ట్ 2025' నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. బుధవారం వెలగపూడి సచివాలయం రెండవ బ్లాక్ లోని తన కార్యాలయంలో మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో మిగతా .. 2లో..

## హైకోర్టు మొట్టికాయలు వేసినా

# జగన్‌కు బుద్ధిరాలేదు

### శ్రీనివాసానంద సరస్వతి



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్** పర కామణి చోరీని చిన్న కేసు అని మాజీ సీఎం జగన్ వ్యాఖ్యానించడంపై సాధుపరిషత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. హిందువులంటే వైకాపా నేతలకు అంత హీనంగా కనిపిస్తు న్నారా? అని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసా నంద సరస్వతి మండిపడ్డారు. విశాఖలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "వేంకటేశ్వరస్వామిని కించ పరిచేలా జగన్ మాట్లాడతారా? ఆయన వ్యాఖ్యలు వింటుంటే గుండె పగిలి పోతోంది. వేంకటేశ్వరస్వామి గురించి మాట్లాడేటప్పుడు ఎంతో భక్తిభావంతో ఉండాలి. హైకోర్టు మొట్టికాయలు వేసినా జగన్‌కు బుద్ధిరాలేదు. హిందూ మతం, దేవాలయాలపై దాడి చేయడమే వైకాపా పనిగా పెట్టుకుంది. ఆ పార్టీ నేతలు హిందువుల పక్షాన ఎప్పుడు నిల బడ్డారో చెప్పాలి" అని శ్రీనివాసానంద సరస్వతి నిలదీశారు.

## ఏఎన్నార్ కళాశాల విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు

# రూ.2 కోట్ల విరాళం : నాగార్జున




**గుడివాడ, విశ్వం వాయిస్ న్యూస్** తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్నార్) పెద్దగా చదువుకోకపోయినా వేల మందికి బంగారు భవిష్యత్తు ఇచ్చేందుకు కృషి చేశారని ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగార్జున అన్నారు. కృష్ణా జిల్లా గుడివాడలో ఏఎన్నార్ కళాశాల వజ్రోత్సవ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజాతో కలిసి ఆయన పాల్గొన్నారు. కళాశాలలో రూసా భవనాన్ని నాగార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1959లో కళాశాలకు ఏఎన్నార్ రూ.లక్ష విరాళం మిగతా .. 2లో..

# కలామ్‌కు ముందు వాజ్‌పేయిని రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రతిపాదించిన భాజపా

**విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాష్ట్రపతి అభ్యర్థిగా ఏపీజే అబ్దుల్ కలామ్ పేరును ఎన్నుకోవడానికి ముందు ఆ పదవికి భాజపా అటల్ బిహారీ వాజ్‌పేయి పేరును ప్రతిపాదించిందట. ఆ సమయంలో వాజ్‌పేయి మీడియా సలహాదారుగా ఉన్న అశోక్ టండన్ రాసిన పుస్తకం 'అటల్ సంస్మరణ్' లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. వాజ్‌పేయి పేరును రాష్ట్రపతి పదవికి ప్రతిపాదించి, ప్రధాని స్థానంలో ఆ పార్టీ అగ్రనేత ఎల్.కె.అద్వాణీని ఎన్నుకోవాలని భాజపా సూచనలు చేసినట్లు అశోక్ టండన్ పేర్కొన్నారు. అయితే పార్టీ చేసిన ఈ ప్రతిపాదనను అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి మిగతా .. 2లో..





## ఐబొమ్మ రవికి

# మరో 12 రోజుల పాటు పోలీసు కస్టడీ

**మూడు కేసుల్లో 4 రోజుల చొప్పున విచారణ చేయాలన్న కోర్టు**

**ఈ నెల 18 నుంచి రవిని కస్టడీకి తీసుకోనున్న సైబర్ క్రైమ్ పోలీసులు**





**విశ్వం వాయిస్ న్యూస్ :** పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు రవిని మరోసారి పోలీసు కస్టడీకి అప్పగిస్తూ నాంపల్లి డిస్ట్రిక్ట్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మరో మూడు కేసుల్లో నాలుగు రోజుల చొప్పున 12 రోజుల పాటు కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. ఎల్లుండి నుంచి సైబర్ క్రైమ్ పోలీసులు అతనిని కస్టడీకి తీసుకుని విచారించనున్నారు. మరో మూడు కేసుల్లో ఐబొమ్మ రవిని విచారించాలని సైబర్ క్రైమ్ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఒక్కో కేసులో నాలుగు రోజుల చొప్పున విచారించాలని కోర్టు ఆదేశించింది. నిన్న మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ప్రభుత్వ వైద్య కళాశాలలు నిర్మిస్తున్నాం..

మాట్లాడుతూ..."పీపీపీ ద్వారా మెరుగ్గా సేవలు అందుతాయి. వైద్య కళాశాలలు ప్రైవేటు పరం చేసేశారని కొందరు మాట్లాడుతున్నారు. పీపీపీ పద్దతిలో మెడికల్ కాలేజీలు నిర్మాణం చేపడుతున్నా... అవి ప్రభుత్వ కళాశాలల పేరుతోనే నడుస్తాయి. మెడికల్ కాలేజీల నిబంధనలు కూడా రాష్ట్ర ప్రభుత్వమే నిర్దేశిస్తుంది. 70 శాతం మందికి ఎన్టీఆర్ వైద్య సేవలు ఆయా కళాశాలల్లో అందుతాయి, సీట్లు కూడా పెరుతాయి. రూ.500 కోట్లతో రుషికొండ ప్యాలెస్ నిర్మించి డబ్బులు వృధా చేశారు. ఆ డబ్బు ఉంటే రెండు మెడికల్ కాలేజీలను నిర్మించుకునేవాళ్లం. రుషికొండ ప్యాలెస్ ఇప్పుడు ఓ వైట్ ఎలిఫెంట్‌గా మారింది. కేంద్ర ప్రభుత్వం కూడా పీపీపీ కింద ప్రాజెక్టులు చేపడుతోంది. విమర్శలు చేస్తే భయపడేది లేదు. వాస్తవాలన్నీ ప్రజలకు తెలియాలి. రోడ్లను పీపీపీ ద్వారానే నిర్మిస్తున్నారు. కానీ అవి ప్రైవేటు వ్యక్తులది అయిపోతాయా?"అని చంద్రబాబు ప్రశ్నించారు.

**నిబద్ధతతో కూటమి ప్రభుత్వ లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లాలి : పవన్ కళ్యాణ్**

జిల్లా కలెక్టర్లు నిబద్ధతతో పని చేస్తూ కూటమి ప్రభుత్వ లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ దిశా నిర్దేశం చేశారు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం ప్రాధాన్యంగా తీసుకున్నామనీ, అడవి తల్లి బాట పేరుతో చేపట్టిన ఈ ప్రాజెక్టును సంబంధిత జిల్లాల కలెక్టర్లు సమర్ధంగా అమలు చేస్తున్నారన్నారు. బుధవారం ఉదయం రాష్ట్ర సచివాలయంలో5వ కలెక్టర్ల సదస్సులో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రివర్గ సహచరులు, ఉన్నతాధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "రాష్ట్ర అభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు అందిస్తున్న కలెక్టర్లకు అభినందనలు. భవిష్యత్తులోనూ కూటమి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సేవలందించాలి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పల్లె పండగ 1.0 పనులను గడువులోపు పూర్తి చేయగలిగామన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నరేగా నిధులతో గత ఏడాది చేపట్టిన పల్లె పండుగ 1.0 ద్వారా గ్రామాల్లో 4 వేల కిలోమీటర్ల మేర సిమెంటు రోడ్లు నిర్ణీత సమయానికి పూర్తి చేయగలిగాం. రైతులకి అండగా 22,500 మినీ గోకులాలు, 15 వేల నీటి తొట్టెలు, 1.2 లక్షల ఫామ్ పాండ్స్ నిర్మించాం. సకాలంలో పనులు పూర్తి చేయగలిగాము. 2025 %-% 2026 ఆర్థిక సంవత్సరానికి 41.12 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించాం. మొత్తం 15.95 కోట్ల పని దినాల ద్వారా రూ. 4,330 కోట్ల వేతనాల రూపంలో చెల్లించాం. మెటీరియల్ కాంపోనెంట్ కింద మరో రూ. 1,056.85 కోట్లు బిల్లుల రూపంలో చెల్లించాం. ఇది గ్రామీణ ప్రజలకు ఆర్థిక చేయూతను ఇచ్చింది.

**స్వచ్ఛ రథం సత్ఫలితాలనిస్తోంది**

గ్రామ పంచాయతీల స్వయం ఆదాయార్జన మార్గాలపై కూడా దృష్టి సారిస్తాం. టాక్స్, నాన్ టాక్స్ అసైన్మెంట్లు డిజిటలైజ్ చేసే కార్యక్రమంపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టిపెట్టాలి. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ శిక్షణ కార్యక్రమాల్లో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచాం. ఉద్యోగుల సామర్థ్యం పెంపుకి ఈ శిక్షణా తరగతులు ఎంతగానో తోడ్పడ్డాయి. గ్రామ స్థాయిలో ఎప్పటికప్పుడు పాలనా సామర్థ్యాల పెంపు కోసం కలెక్టర్లు కృషి చేయాలి. జూన్ నెలలో తీసుకువచ్చిన స్వచ్ఛ రథం కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. జూన్ లో ఒక యూనిట్ తో ప్రారంభించగా నేటికి ఆ సంఖ్య 25కి చేరింది. పీఎం జన్మన్ పథకం, నరేగా సాయంతో మారుమూల గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించే కార్యక్రమాన్ని చేపట్టాం. రహదారుల నిర్మాణానికి అవసరం అయిన అటవీ అనుమతుల వ్యవహారంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ 9కి 9 అనుమతులు పూర్తి చేసి 100 శాతం స్ట్రయిక్ సాధించారు. అల్లూరి జిల్లా కలెక్టర్ 88కి 79 పనులకు అనుమతులు క్లియర్ చేశారు. అడవి తల్లి బాట పనులపై కలెక్టర్లు శ్రద్ధ చూపుతున్నారనడానికి ఇది నిదర్శనం. మరింత ఉత్సాహంగా పని చేస్తూ నిబద్ధతతో ప్రజలకు సేవలు అందించాలి" అన్నారు.

# 'పల్లె' జీవనానికి బలమైన పునాది

పరిస్థితిలో సహజ ఆహార విక్రయ కేంద్రాలు వారికి భరోసాగా మారాయి. పలకోడేరు, ఉండి, అత్తిలి, తాడేపల్లిగూడెం మండలాల్లో గ్రామ సంస్థలు, మండల సమాఖ్యల ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కేంద్రాలు రైతులకు కనీస మద్దతు ధరను నిర్ధారిస్తున్నాయి. ప్రతిరోజూ రసాయన రహిత కూరగాయలు ప్రజలకు అందుబాటులోకి వస్తుండగా, మహిళలకు ఉపాధి కలుగుతోంది. ఈ వ్యవస్థను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా సమీక్షలు నిర్వహిస్తూ సూచనలు ఇస్తున్నారని అధికారులు తెలిపారు.

**మహిళా పారిశ్రామికతకు మధుర స్వరూపం–చోకో టేల్స్**

తాడేపల్లిగూడెం మండల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రారంభమైన చోకో టేల్స్ చాక్లెట్ తయారీ కేంద్రం మహిళా శక్తికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. స్థానిక కోకో గింజలతో, పూర్తిగా శిక్షణ పొందిన స్వయం సహాయక సంఘాల మహిళలే ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. తయారీ నుంచి ప్యాకింగ్ వరకూ అన్ని దశల్లో మహిళలే ముందుంటున్నారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమల పథకం కింద రుణం పొందడంలోనూ, మార్కెట్ అనుసంధానంలోనూ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తీసుకున్న ప్రత్యేక చొరవే ఈ యూనిట్ విజయంలో కీలకంగా మారిందని మహిళలు పేర్కొంటున్నారు.

**గుర్రపుడెక్క నుంచి ఉపాధి – పర్యావరణ హిత మార్గం**

కాలువలు, చెరువులను ఆక్రమించి వ్యవసాయానికి ఆటంకంగా మారిన (గుర్రపుడెక్క) జలకుంభి సమస్యను పశ్చిమ గోదావరిలో అవకాశంగా మలిచారు. రసాయనాల వాడకం లేకుండా జలకుంభిని తొలగించి, దాన్ని సేంద్రియ ఎరువుగా మార్చే కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఉపాధి సృష్టి జరుగుతోంది. గ్రామ సంస్థలకు మంచి ఆదాయం లభించడమే కాకుండా మహిళలకు స్థిర వేతనం అందుతోంది. ఈ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా విస్తరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో అమలు వేగం పుంజుకుంది.

**నిరంతర సమన్వయం, పర్యవేక్షణ, ప్రోత్సాహమే విజయానికి సూత్రం**

రైతు, మహిళ, ప్రకృతిఈ మూడింటి మధ్య సమతుల్యత సాధించాలన్న సంకల్పంతో జిల్లా యంత్రాంగాన్ని సమన్వయపరుస్తూ కలెక్టర్ చదలవాడ నాగరాణి ముందుకు తీసుకెళ్తున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలు, నిరంతర సమీక్షలు, స్పష్టమైన లక్ష్యాలతో ఆమె పనిచేయడం వల్లే పశ్చిమ గోదావరి జిల్లా రాష్ట్రానికి మార్గదర్శక జిల్లాగా ఎదుగుతోందని రాష్ట్ర స్థాయి అధికారులు అభిప్రాయపడుతున్నారు. పల్లెల్లో పెరుగుతున్న ఆత్మవిశ్వాసం, ఆదాయ భరోసా, పచ్చని ప్రకృతిఇవన్నీ కలెక్టర్ చదలవాడ నాగరాణి నాయకత్వానికి ప్రత్యక్ష ఫలితాలుగా నిలుస్తున్నాయి.

# పర్యాటక రంగంలో సరికొత్త అధ్యాయం

ఏడీటీవోఐ ప్రతినిధులతో ఎంవోయూ (అవగాహన ఒప్పందం) కుదుర్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశీయ పర్యాటక రంగంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎంవోయూ కుదుర్చుకున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అద్భుతమైన తీరప్రాంతం, మెరుగైన మౌలిక వసతులు కలిగిన విశాఖ నగరం ఈ జాతీయ స్థాయి ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమన్నారు. రాష్ట్రంలోని కోస్టల్ టూరిజం, ఆధ్యాత్మిక క్షేత్రాలు, చారిత్రక కట్టడాలు, ఎకో–అడ్వెంచర్ టూరిజం, ఏజెన్సీ ప్రాంతాల పర్యాటకాన్ని జాతీయ స్థాయిలో ప్రదర్శించడానికి ఇది ఒక గొప్ప వేదికని పేర్కొన్నారు.రెండు రోజుల పాటు జరిగే ఈ మార్ట్‌లో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ టూర్ ఆపరేటర్లు, హోటల్ యజమానులు, డెస్టినేషన్ ప్రమోటర్లు, పర్యాటక రంగ వాటాదారులు, ట్రావెల్ నిపుణులు పాల్గొంటారని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఈవెంట్ బీ2బీ నెట్‌వర్కింగ్ సెషన్లు,గమ్యస్థానాల ప్రదర్శనలు, వ్యాపార సమావేశాలు, ప్యానెల్ చర్చలు, పర్యాటక ప్రాంతాల సందర్శన కార్యక్రమాల ద్వారా స్థానిక పర్యాటక వాటాదారులకు జాతీయ స్థాయిలో వ్యాపార సంబంధాలు ఏర్పడతాయని తాము భావిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అపారమైన, వైవిధ్యభరితమైన పర్యాటక అవకాశాలను ప్రదర్శించడానికి ఇదొక అద్భుతమైన వేదికగా నిలుస్తుందని వెల్లడించారు. ఈ చొరవ వల్ల రాష్ట్రానికి పర్యాటకుల రాక పెరగడమే కాకుండా, స్థానికులకు ఉపాధి అవకాశాలు, దీర్ఘకాలిక వ్యాపార సంబంధాలు మెరుగుపడతాయని, జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు మాట్లాడుతూ.. దేశీయ పర్యాటకాన్ని బలోపేతం చేయడం, అంతగా ప్రాచుర్యం లేని పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించడం, వెలుగులోకి తీసుకురావడం, స్థానిక వర్గాలకు స్థిరమైన పర్యాటక వృద్ధి, ఉపాధి అవకాశాలను కల్పించడం తమ అసోసియేషన్ లక్ష్యమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు పర్యాటక శాఖ కూడా బాధ్యతాయుతమైన, సమగ్రమైన పర్యాటక వృద్ధిని సాధించేందుకు జాతీయ సంఘాలతో కలిసి పనిచేస్తామని పునరుద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో జరగనున్న ఈ అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా నేషనల్ టూరిజం మార్ట్ 2025 ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశంలోని అత్యంత డైనమిక్, భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా ఉన్న పర్యాటక కేంద్రంగా మార్చడంలో ఒక మైలురాయిగా నిలుస్తుందనడంలో అతిశయోక్తి లేదు. కార్యక్రమంలో పర్యాటక శాఖ స్పెషల్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీఏ సీఈవో, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట, ఏపీటీఏ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, ఏపీ సృజనాత్మక సంస్కృతి సమితి చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి, కమ్యూనికేషన్ ఆఫీసర్ పద్మారాణి, అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ వేద్ ఖన్నా, వైస్ ప్రెసిడెంట్ ఆశిష్, ట్రావెల్ మార్ట్ సీఈవో విజయ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మరో 12 రోజుల పాటు పోలీసు కస్టడీ

జరిగిన విచారణలో రవి తరఫు న్యాయవాది శ్రీనాథ్ కోర్టులో వాదనలు వినిపించారు. రవిని కస్టడీ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని కోర్టుకు తెలిపారు. ఇప్పటికే రెండుసార్లు కస్టడీకి తీసుకున్నారని తెలిపారు. మరోవైపు, రవిని కస్టడీకి తీసుకుని విచారిస్తేనే పూర్తి నెట్ వర్క్ బయటపడుతుందని సైబర్ క్రైమ్ పోలీసుల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

# రూ.2 కోట్ల విరాళం : నాగార్జున

అందించారన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం తమ కుటుంబం తరఫున రూ.2 కోట్ల విరాళం అందిస్తున్నట్లు నాగార్జున ప్రకటించారు. మనుషులు శాశ్వతం కాదని.. మనం చేసే పనులు శాశ్వతమని చెప్పారు. "రైతుబిడ్డ అయిన నాగేశ్వరరావుకు చదువంటే ఎంతో ఇష్టం. సినిమాకు రూ.5వేలు పారితోషకం వచ్చే 1951లో కళాశాలకు రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు నేడు దేశ, విదేశాల్లో ఎంతో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. కళాశాల అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తోడ్పాటు అందించాలి. గుడివాడలో నాపై చూపుతున్న ప్రేమాభిమానాలకు చేతులెత్తి నమస్కరిస్తున్నా" అని నాగార్జున అన్నారు. జస్టిస్ బట్టు దేవానంద్ మాట్లాడుతూ మహోన్నత ఆలోచనతో ఈ కళాశాల ఏర్పడిందని చెప్పారు. 75 ఏళ్లుగా వేలాది మందికి మంచి భవిష్యత్తును ఇవ్వడమే కాక దేశానికి గొప్ప పౌరులను అందించిందన్నారు. ఈ కళాశాలలో చదివిన నేను.. హైకోర్టు న్యాయమూర్తి స్థాయికి ఎదిగానని చెప్పారు. అనంతరం నాగార్జునను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సత్కరించారు. నాగార్జున రాకతో విద్యార్థులు కేరింతలు కొట్టారు.

# కలామ్‌కు ముందు వాజ్‌పేయిని రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రతిపాదించిన భాజపా

నిరాకరించినట్లు తెలిపారు. ప్రధానిగా ఉన్న తాను రాష్ట్రపతి పదవికి మారడం సరైన చర్య కాదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారన్నారు. తాను ఎంతటి ప్రజాదరణ పొందిన నాయకుడిని అయినప్పటికీ.. మెజారిటీ ఆధారంగా రాష్ట్రపతి పదవిని పొందలేనని వాజ్‌పేయీ పేర్కొన్నట్లు అశోక్ టండన్ తెలిపారు. రాష్ట్రపతి అభ్యర్థి విషయంలో ఏకాభిప్రాయం కుదిరేలా చర్చలు జరపడానికి ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, ప్రణబ్ ముఖర్జీ, మన్మోహన్ సింగ్‌లను ఆయన ఆహ్వానించారన్నారు. అనంతరం రాష్ట్రపతి స్థానానికి ఎన్డీఏ తరఫున ఏపీజే అబ్దుల్ కలామ్‌ను అభ్యర్థిగా ప్రతిపాదిస్తున్నట్లు ప్రకటించారన్నారు. దీనికి కాంగ్రెస్ కూడా మద్దతు తెలపడంతో 2002లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం, ప్రతిపక్షాల మద్దతుతో అబ్దుల్ కలామ్ భారత రాష్ట్రపతిగా ఎన్నికైనట్లు తెలిపారు. వాజ్‌పేయీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలోని అనేక ఘటనలను అశోక్ టండన్ తన పుస్తకంలో వివరించారు. అటల్–అద్వానీలకు విధానపరమైన అంశాలపై విభేదాలు ఉన్నప్పటికీ.. భారత రాజకీయాల్లో వారి భాగస్వామ్యం, సహకారం సమతుల్యతకు చిహ్నంగా ఉండేదన్నారు. వారి దిశానిర్దేశంలో భాజపా మరింత అభివృద్ధి చెందినట్లు రాసుకొచ్చారు.

ఇచ్చట అన్ని రకాల

# రిజిస్ట్రేషన్ చేయబడును

**మామూళ్లు ఇస్తే ఎలాంటి రిజిస్ట్రేషనైనా చేయబడును**

**రైతులను దోచుకుంటున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సిబ్బంది**

**ఫీజు టు ఫీజు వసూలు చేస్తున్న వైనం – అధిక రేట్లకు స్టాంపులు విక్రయం**




**సత్తెనపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** మీ పోలం.. ఖాళీ స్థలాలు. భవనాలైనా సర్వేనెంబర్ తప్పుందా.. రిజిస్ట్రేషన్ చేయడానికి సరైన పత్రాలు లేవా.. ఏం పర్వాలేదు మామూలు ఇస్తే చాలు క్షణాల్లో రిజిస్ట్రేషన్ అయిపోతాయ్... ఆలోచించిన ఆసియా భంగం త్వరపడండి ఇదే మంచి అవకాశం.. ఇదేంటి ఇలా జరిగిద్దా అని అనుకుంటున్నారా..? పల్నాడు జిల్లా సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రం అక్షరాల ఇలానే జరుగుతుందిని చర్చించుకుంటున్నారు...మరి కొద్ది రోజుల్లో స్థానిక రిజిస్ట్రార్ పదోన్నతపై బదిలీ అవుతుండడంతో... దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకునే విధంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. దీంతో రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రజలు ఒకపక్క బెంబేలెత్తుతుండగా.. మరొకపక్క ఇదే అవకాశాన్ని అందిపుచ్చుకొని వక్రమార్గంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటు సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తోంది. ఇటీవల సత్తెనపల్లి మండలంలోని పలు గ్రామాలలో అక్రమ రిజిస్ట్రేషన్ నేపథ్యంలో కేసులు పెట్టుకున్న సందర్భాలు ఉన్నాయి.. ఓ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో సాక్షాత్తు ప్రస్తుత రిజిస్ట్రారే పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టిన విషయం చర్చనీయాంసమైంది.

**అంతా ఆ రఘురాఘవుడి మహిమా..**

వివిధ రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చేవారు ముందుగా రఘు రాఘవుడ్ని కలవాల్సిందే.. నిబంధనల ప్రకారంగా అన్ని పత్రాలు ఉన్నప్పటికీ.. చిన్న చిన్న లోపాలు చూపించి ఫిజ్ టు ఫీజ్ ఇస్తే గాని రిజిస్ట్రేషన్ చేయని పరిస్థితి. సర్వే నెంబర్ తప్పున్నా.. పూర్వాజిత ఆస్తులు., అసైన్డ్, చుక్కల భూములు రిజిస్ట్రేషన్ సమయంలో వారు చెప్పినంత డబ్బులు ఇస్తే వెంటనే ఆ పనైనట్టే బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. అంతేకాకుండా కార్యాలయంలో ఎంతో గోప్యా సమాచారమైనా డబ్బులు ఇస్తే ఇస్తే చాలు రెండో కంటికి తెలియకుండా పత్రాల రూపంలో అందజేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఇబ్బంది పడుతున్న రైతులు రియల్టర్లు**

కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ... ఉన్నతాధికారుల ఉదాసేనత వెరసీ రిజిస్ట్రేషన్ల విషయంలో అందనకాడికీ దండుకుండటంతో రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఫీజ్ టూ ఫీజ్ మామూళ్లు ఇవ్వాల్సి ఉండటంతో రిజిస్ట్రేషన్ కి రావాలంటే బయపడుతున్నారు. ఇదిలా ఇదిలా డాక్యుమెంట్ విక్రయించేవారు నిబంధనలను విరుద్ధంగా ఎక్కువ వసూలు చేస్తున్నారు.. ఇంత జరుగుతున్నా ఉన్నత అధికారులు ఈవైపు కన్నెత్తి చూడకపోవటం పై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి రిజిస్ట్రేషన్ జరుగుతున్న అక్రమాలను వెలికి తీసి అధిక వసూలకు పాల్పడుతున్నా వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇబ్బందులు పడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

పండుగల వేళ షాపింగ్ మాల్స్ దగ్గర

# ట్రాఫిక్‌కు అంతరాయం

**పారిశుధ్యంపై కఠిన చర్యలు**

**వాణిజ్య సంస్థల యజమానులతో సమావేశంలో కమిషనర్ స్పష్టత**



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండుగల నేపథ్యంలో కాకినాడ నగరంలో ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ అవ్యవస్థ, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ మేరకు నగరంలోని వాణిజ్య సంస్థల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు. డిసెంబర్ 20 నుంచి జనవరి 20 వరకు పెద్ద సంఖ్యలో సందర్శకులు రానున్న నేపథ్యంలో ప్రజల భద్రత, సులభ రవాణా కోసం షాపులు, మాల్స్ యజమానులు తప్పనిసరిగా సహకరించాలని కోరారు. ప్రతి షాపు వద్ద శిక్షణ పొందిన పార్కింగ్ అటెండెంట్లను నియమించి వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. ప్రవేశద్వారాలు, కీలక ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రతను పెంచాలని సూచించారు. అధిక ట్రాఫిక్ ప్రాంతాల్లో బ్యారికేడ్లు ఏర్పాటు చేసి నియంత్రణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. బకాయి పన్నులు వెంటనే చెల్లించాలని ఆదేశించారు. రాబోయే శనివారం ముఖ్యమంత్రి నిర్వహించనున్న సస కార్యక్రమం విజయవంతానికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి, చెత్తను వేరు చేసి పారవేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ నెల 21వ తేదీ నుంచి షాపింగ్ కాంప్లెక్సుల ముందు సెక్యూరిటీ గార్డులను తప్పనిసరిగా నియమించాలన్నారు. ట్రాఫిక్ సిఐ ఎన్.రమేష్ మాట్లాడుతూ నగర జనాభా 6.5 లక్షలకు చేరిందని, ఎన్ హెచ్ –214 హైవే పూర్తికాకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు పెరిగాయని తెలిపారు. అవసరమైన 180 మంది సిబ్బంది స్థానంలో ప్రస్తుతం 40 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. లెఫ్ట్ సైడ్ పార్కింగ్‌ను కఠినంగా అమలు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ సీఐ 2 అప్పలనాయుడు మాట్లాడుతూ డబుల్ పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని, రోడ్ మార్కింగ్స్, సెల్లార్ పార్కింగ్ లేకపోవడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని చెప్పారు. ప్రైవేట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీల సహకారం అవసరమని సూచించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ గ్రంధి బాబ్జి మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా రహదారుల వెడల్పు పెరగకపోయినా ట్రాఫిక్ మాత్రం భారీగా పెరిగిందన్నారు. ఖాళీ స్థలాలను తక్కువ ఫీజుతో పార్కింగ్‌కు వినియోగించాలని సూచించారు. క్లోత్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధి బి. సత్యనారాయణ డబుల్ పార్కింగ్ నియంత్రణే పరిష్కారమని పేర్కొన్నారు. సూపరింటెండింగ్ ఇంజినీర్ పి వెంకట్రావు మాట్లాడుతూ సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణకు సుమారు ?80 లక్షలు అవసరమని తెలిపారు. 20 ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాల ద్వారా ఛాలాన్లు జారీ చేసే ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృద్వి చరణ్ పండుగల కాలంలో చెత్త పెరుగుతున్నందున అదనపు డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి, కాలువల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశం చివర్లో కమిషనర్ మాట్లాడుతూ, " అస్తవ్యవస్థ ట్రాఫిక్ నుంచి ప్రజలను రక్షించడమే మన లక్ష్యం. ప్రజలు లేకపోతే వ్యాపారాలు లేవుబీ వ్యాపారాలు లేకపోతే ప్రజలు లేరు" అంటూ అందరి సమన్వయంతో క్రమశిక్షణ పాటించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, అదనపు కమిషనర్ కే శ్రీనివాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, వ్యాపారస్తులు, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్స్ సమాజానికి మార్గదర్శకులు : ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ



**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజానికి పెన్షనర్స్‌లు మార్గదర్శకులని ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ పేర్కొన్నారు. బుధవారం కాకినాడలో ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కాకినాడ జిల్లా శాఖ కార్యాలయంలో పెన్షనర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలిత పెన్షనర్స్ జీవనజ్యోతి నకరా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పెన్షనర్స్ లను సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజం మేలు కోసం పెన్షనర్స్ రాజకీయాల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. సమాజంలో పెన్షనర్స్ పాత్ర కీలకమని పేర్కొన్నారు. పెన్షనర్లు సమాజానికి ఎంతో అనుభవాన్ని, జ్ఞానాన్ని అందిస్తారని, వారి సేవలను గుర్తిస్తూ, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె అన్నారు.జిల్లా ట్రెజరీ ఆఫీసర్ ఎ. గణేష్ బాబు, ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా శాఖ కాకినాడ జిల్లా అధ్యక్షులు కె.పద్మనాభం మాట్లాడారు . రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటామన్నారు. పెన్షనర్స్ సమస్యల ను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ డి అపర్ణ, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి. నూకరాజు, కోశాధికారి వి. శేషగిరి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం పీహెచ్‌సీలో

## నూతన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ప్రారంభం

### రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

**ధవలేశ్వరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ధవలేశ్వరం నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని రాజమండ్రి రూరల్ నియోజకవర్గం శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి బుధవారం ప్రారంభించారు. కొత్తగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాలో ప్రథమంగా ఈ బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని ప్రారంభించడం విశేషం అన్నారు. ఈ నూతన భవనంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ పరీక్షలు, స్టోర్ రూమ్, హెచ్ఎంఐఎస్ రిపోర్టింగ్ రూమ్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఈ భవనం నిర్మాణానికి ప్రభుత్వం సమకూర్చిన రూ.50 లక్షలతో పాటు, శాసనసభ్యుల సిఫార్సు మేరకు ఇంటర్నేషనల్ పేపర్ మిల్ లిమిటెడ్ సంస్థ సిఎస్ఆర్-1 నిధుల కింద సుమారు రూ.11 లక్షలు వెచ్చించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలల్లో ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉన్న వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పీహెచ్‌సీల్లో వైద్య సేవలతో పాటు మందులు, రక్త పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాలు తెలియక చాలా మంది ప్రజలు అనవసరంగా ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అధిక ఖర్చులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రాథమిక



ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు ప్రధానంగా నిర్వహించడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో సీజేరియన్ ఆపరేషన్లు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. సాధారణ ప్రసవాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఈ ఆసుపత్రికి మినరల్ వాటర్ ప్లాంట్ అవసరం ఉందని తెలుపగా, దానిని కూడా త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రూ.11 లక్షలతో పాటు మొత్తం రూ.20 లక్షలతో అదనపు బ్లాక్ మరియు వేచి ఉండే గది నిర్మాణానికి సిఎస్ఆర్ విధానంలో పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అవసరమైతే మరిన్ని నిధులు విడుదల చేయించేందుకు తాము చొరవ తీసుకుంటామని భరోసా ఇచ్చారు. వైద్య ఖర్చుల వల్ల ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలను గుర్తించి సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో గత 17 నెలల్లో రూ.3 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించడం జరిగిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం హయాంలో ఎన్‌టీఆర్ వైద్య సేవ కింద చికిత్సకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నామని, గత ప్రభుత్వం హయాంలో బాకీగా ఉన్న రూ.2600 కోట్లను విడతల వారీగా చెల్లింపులు చేస్తున్నట్లు వివరించారు. వైద్య అధికారులు మాట్లాడుతూ, ఈ నూతన భవనం ప్రారంభంతో ధవలేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మరింత ఎక్కువ మంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్ కిరణ్, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్స్యేటి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందురి అప్పారావు,తలారి మూర్తి, పుక్కళ్ళ రాజు,ఆళ్ల ఆనందరావు, బీర ప్రకాష్, గుర్రాల వెంకట్రావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్.వి.వి. సత్యనారాయణ, డాక్టర్ రోహిత, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపిడివో ఆర్మ్ స్ట్రాంగ్,ఏఎన్ఎంలు, సూపర్వైజర్లు, అసిస్టెంట్లు, వివిధ కేడర్లకు చెందిన ఆరోగ్య సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పవిత్రమైన గండిపోసమ్మ అమ్మవారి ఆలయానికి

## పాలాభిషేకం సేసిన చైర్మన్, గొందూరు గ్రామస్తులు

**దేవిపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాతృశ్రీ గండి పోచమ్మ తల్లి ఆలయం వద్ద పి గొందూరు గ్రామస్తులు, ఆలయ పాలకమండలి చైర్మన్ మలుగుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పాలభిషేకం కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం కోసము ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద బహుళార్థ సాధక ప్రాజెక్టులలో ఒకటి అయిన పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురి అగుచున్న అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలం, పి గొందూరు గ్రామంలో గల స్వయంభూ మాతృశ్రీ గండి పోశమ్మ అమ్మవారి దేవాలయంను గిరిజనుల మనోభావాలు, మత విశ్వాసాలను గౌరవించి పోలవరం ప్రాజెక్ట్ ముంపు బారి నుండి రక్షించి అభివృద్ధి చేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేసి ప్రభుత్వం జి.వో. జారీ చేసిన సందర్భంలో కోట్లాది మంది భక్తుల మనోభావాలను గౌరవించి ఇంతటి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న తరుణంలో గౌరవ భారత ప్రధాని నరేంద్ర మోడీకి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, గౌరవ ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కల్యాణ్‌కి, జలవనరులు శాఖామాత్యులు నిమ్మల రామానాయుడుకి, దేవదాయ ధర్మదాయ శాఖా మాత్యులు ఆనం రామ నారాయణ రెడ్డికి, పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్‌కి, రంపచోడవరం నియోజక ఎమ్మెల్యే, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు మిరియాల శిరీష దేవికి, పోలవరం ప్రాజెక్ట్ ఇ ఎన్ సి & సిఈ నరసింహ మూర్తికి పాలాభిషేకం జరిపించడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గోళ్ళ చంటి బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలవరం ప్రాజెక్టుని శరవేగంతో పూర్తి చేస్తూ గోదావరి ఒడ్డున స్వయంభుగా వెలిసియున్న శ్రీ గండి పోచమ్మ



ఆయానికి రెండు వందల ఏడు కోట్ల 58 లక్షల రూ/ మంజూరు చేసి జీవో జారీ చేసినందుకు కూటమి ప్రభుత్వానికి మరియు జల శాఖ అధికారులు ఎండోమెంట్ అధికారులకు ఏపీ జెన్కో వారికి ఈవో గారికి మా ధన్యవాదములు తెలియజేస్తు మా వంతు కృషి చేస్తామని తెలియజేశారు. జనసేన అధ్యక్షుడు శారపు రాయుడు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు మొదలైన తర్వాత గండి పోచమ్మ తల్లి ఆలయం సంవత్సరంలో సగం రోజులు నీట్లు మునిగి ఉంటుంది కూటమి ప్రభుత్వం గుర్తించి ఆలయాన్ని రక్షణ వాలు నిర్మించడానికి జీవో జారీ చేసి నిధులను విడుదల చేసింది ఈ ఆలయ నిర్మాణం ద్వారా గిరిజన మనోభావాలను భక్తులు మనోభావాలను వెలుగొందితాయి కాబట్టి మనం అందరం ఎలాంటి అపోహలు పోకుండా ఎలాంటి రాజకీయాలు చేయకుండా ఆలయ నిర్మాణానికి కృషి చేద్దామని అన్ని పార్టీలకు విన్నవించుకుంటున్నట్లు తెలియజేశారు. అనంతరం బిజెపి అధ్యక్షుడు కారం రామన్న దొర మాట్లాడుతూ శ్రీ గండి పోచమ్మ తల్లి ఆలయ రక్షణ వాలు భారతదేశ చరిత్రలో ఒకటిగా నిలిచిపోతుందని మా పార్టీ తరపున డిపార్మెంట్‌కి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. పి.గొందూరు గ్రామస్తులు మాట్లాడుతూ మా గ్రామ ఇలవేల్పు దేవత అయినటువంటి మాతృశ్రీ గండి పోచమ్మ తల్లి ఆలయం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల భక్తులకు ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం అటువంటి ఈ పుణ్యక్షేత్రానికి ఆలయ రక్షణ గోడకు క్యాబినెట్ తీర్మానం చేసి నిధులు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వానికి మరియు ఈవో గారికి ధన్యవాదాలు తెలియచేసి గుడి నిర్మాణానికి మా గ్రామం తరపున పూర్తి సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మాగాపు బాబురావు కొండ్ల చిన్న కొండారెడ్డి టిడిపి ప్రధాన కార్యదర్శి కీర్తి గంగరాజు బిజెపి ప్రధాన కార్యదర్శి అయినాల శ్రీనివాస్ టిడిపి మాజీ మండల అధ్యక్షుడు ముండ్రు మధుసూదన్ రావు మాజీ అధ్యక్షుడు తైలం గంగాధర్ తెలుగు యువత అధ్యక్షుడు జొన్నల శ్రీనివాస్ కుమార్ మార్కెట్ డైరెక్ట్ జొన్నల రాంబాబు మండల ఉపాధ్యక్షులు ఏలేటి కృష్ణ మోహన్ ఎస్టికమిటీ అధ్యకులు సోదే వెంకన్న దొర ఉపాధ్యక్షులు మిర్తివాడ వీరబాబు మాజీ సర్పంచ్ కోండ్ల భుజిరెడ్డి ఆలయ పాలక మండల సభ్యులు సూర్య వెంకటేశ్వరరావు కరణం సత్యనారాయణ పోతుల పెద్ద సత్యనారాయణ మాదాసు సుబ్రహ్మణ్యం రమణ కుంజం కళ్యాణి పుసం భాగ్యలక్ష్మి నేరంబేవి సొసైటీ డైరెక్టర్ పాలపాటి నాగేశ్వరావు మడకం శ్రీనివాస దొర కాళ్ళ సత్య రాజు కొమరం దొరబాబు టిడిపి ప్రచార కార్యదర్శి పిరిగాని ఏసుబాబుకొండ్లా రామకృష్ణ పి గొందూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు కలుమ్ రామకృష్ణ గ్రామ కమిటీ సెక్రెటరీ బెల్లంకొండ రాజు సొదే అరుణ సోదే దుర్గబాబు ఐ టి డి పి సభ్యుడు మడకం చిరంజీవి దొర మేదే బాపన్న దొర తేల్లం శాంతి ప్రియ తెల్లం వెంకన్న దొర జనసేన నాయకులు తాటి రాజేష్ తుర్రు ధర్మం దొర సోదే రవి మానుపాటి అంజిబాబు, భద్రం , టీ శ్రీను,సురేష్, రమేష్, శ్రీను,మీడియా కోఆర్డినేటర్ కారం దుర్గా ప్రసాద్,కూటమి నాయకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 'బాల్ వివాహ్ ముక్త్ భారత్'పై విస్తృత ప్రచారం



**కాకినాడ జిల్లా (పెద్దాపురం), విశ్వం వాయిస్ న్యూస్ :** "బాల్య వివాహ్ ముక్త్ భారత్" 100 రోజుల కాంపెయిన్ లో భాగంగా కాకినాడ జిల్లా , మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, మండల న్యాయ సేవాధికార సంస్థ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సంయుక్తంగా, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక పెద్దాపురం మండలం మహాత్మా జ్యోతిభ పూలె ఆంధ్రప్రదేశ్ బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రిన్సిపల్ చల్లా లోవరాజు అధ్యక్షతన బాల్య వివాహ ముక్త భారత్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహ ముక్త భారత్ అనే కాంపెయిన్ 27 నవంబర్ 2025 నుండి 8 మార్చి 2026 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో బాల్య వివాహా రహిత దేశంగా భారత దేశాన్ని తీర్చి దిద్దాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాలను విద్యా రంగ సంస్థలలో నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. బాల్య వివాహ నిరోధ చట్టం 2006 ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు పూర్తి కాకుండా మరియు అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయరాదని అన్నారు.బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం మరియు నేరం అని తెలియజేసారు. బాల్య వివాహాలు నుండి బాలలను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడు పై ఉందని అన్నారు. బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు. బాల్య వివాహం జరగడానికి చేసిన ఏ ప్రయత్నాన్నైనా పంచాయతీ, ప్రభుత్వ అధికారులకు తెలియపరచాలని లేదా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ లీగల్ అడ్వకేట్ మడికి రాంబాబు మాట్లాడుతూ హై కోర్టు ఉత్తర్వులు ప్రకారం మరియు 7వ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ వారు ఆదేశాలు మేరకు 100 రోజులు కాంపెయిన్ లో బాల్య వివాహ రహిత దేశంగా తీర్చి దిద్దాలనే దృక్పథంతో ఈ అవగాహన కార్యక్రమాలును సంబంధిత శాఖలు మరియు స్వచ్ఛంద సంస్థల సమన్వయముతో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహించిన మరియు సహకరించిన లేదా వివాహం చేసిన బాల్య వివాహ నిషేధ చట్టం2006 ప్రకారం రెండు సంవత్సరాలు జైలు శిక్ష మరియు ఒక లక్ష రూపాయలు జరిమానా విధించడం జరుగుందని అన్నారు. పోక్సో చట్టం ప్రకారం కూడా చర్యలు తీసుకుంటామని తెలియజేసారు. ఈ కార్యక్రమములో పారాలీగల్ వాలంటీర్ నూతలపాటి అప్పలకొండ, యన్ శ్రీ హర్ష , ప్రధానోపాధ్యాయులు ఎం మాధవ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

యండమూరు గ్రామ మహిళకు

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే నానాజీ



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ కరప మండలం యండమూరు గ్రామానికి చెందినటువంటి నులుకుర్తి లక్ష్మి అనే మహిళ డయాలసిస్ బాధతో బాధపడుతున్న విషయాన్ని ఆ గ్రామ సర్పంచ్ మారెళ్ళ శివ, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు గంజా దుర్గాప్రసాద్ ఆమె ఆర్థిక పరిస్థితిని గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ దృష్టికి తీసుకుని వెళ్ళగా ఆయన స్పందించి ఆమె కుటుంబానికి న్యాయం చేస్తానని ఆమెకు కొన్ని రోజుల ముందు మాటిచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఎమ్మెల్యే నానాజీ బుధవారం సాయంత్రం తన ఇంటి వద్ద ఆమెకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద 42000 రూపాయల చేక్కు అందించారు.

మిసెస్ ఆంధ్ర అందాల పోటీల్లో

## డాక్టర్ యామినిప్రియ సెకండ్ రన్నరప్‌గా విజయం



### విజయం రాజమండ్రికి గర్వకారణం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మన రాజమండ్రి అమ్మాయి డాక్టర్ ఎస్.యామిని ప్రియ ఆంధ్రప్రదేశ్ అందాల పోటీల్లో మరో ఘన విజయం సాధించారు. విజయవాడలో జన్మించి పెరిగిన ఆమె, వివాహానంతరం రాజమండ్రిలో స్థిరపడ్డారు. వృత్తిరీత్యా వైద్యురాలిగా పనిచేస్తూనే, శాస్త్రీయ నృత్య కళాకారిణిగా కూడా ఆమె తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఇంతకుముందు మిసెస్ రాజమండ్రి-2024 విజేతగా నిలిచిన డాక్టర్ యామిని ప్రియ, తాజాగా మిసెస్ ఆంధ్రప్రదేశ్-2025 అందాల పోటీల్లో రెండో రన్నర్అప్ (2 వ స్థానం)గా నిలిచి రాష్ట్ర స్థాయిలో తన ప్రతిభను చాటుకున్నారు. ఈ విజయంతో ఆమె నేటి తరానికి చెందిన గృహిణులు, మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. మిసెస్ ఆంధ్రప్రదేశ్ (శ్రీమతి ఆంధ్రప్రదేశ్)-2025 అందాల పోటీలు డిసెంబర్ 12న విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించ బడ్డాయి. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ నిర్వాహకుడు సతీష్ అడ్డాల నిర్వహించగా, ఇది ఆయన నిర్వహించిన 43వ షో కావడం విశేషం. డాక్టర్ యామిని ప్రియ సాధించిన ఈ విజయం రాజమండ్రి ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది.

31 మంది అభ్యర్థులకు

## కారుణ్య నియామక పత్రాలు అందించిన జిల్లా పరిషత్ చైర్మన్



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా ప్రజా పరిషత్, కాకినాడ కార్యాలయము నందు జిల్లా పరిషత్ యాజమాన్యములో పని చేస్తూ అకాల మరణము చెందిన ఉద్యోగ ఉపాధ్యాయుల వారసులైన 31 మంది అభ్యర్థులకు కారుణ్య నియామము ద్వారా ఉద్యోగ అవకాశము కల్పిస్తూ ఉత్తర్వులను జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ విప్పర్తి వేణుగోపాల్ రావు అందచేసారు. ఈ సందర్భముగా చైర్ పర్సన్ నూతనముగా ఉద్యోగము పొందిన అభ్యర్థులను అభినందనలు తెలియజేస్తూ 23మంది జూనియర్ సహాయకులు, 8 మంది టైపిస్ట్ లు ఉద్యోగ అవకాశము కల్పించి ఖాళీ ఏర్పడిన వెనువెంటనే భర్తీ చేస్తున్నట్టు తెలియజేసారు. జిల్లా ప్రజా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి వి.వి.వి.ఎస్. లక్ష్మణరావు అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ నియామకాలు ఎంతో పారదర్శకతతో వారు కోరుకున్న ప్రాంతాలలో నియమించుట వలన వారు ఎంతో ఉత్సాహం తో ప్రభుత్వ కార్యక్రమాలలో భాగస్వాములవటం ద్వారా ప్రజా సేవ చేయుచు పని చేయుచున్న సంస్థకు, జిల్లా ప్రజా పరిషత్ మంచి పేరు తెచ్చేలా కష్టపడి పని చేయాలని సూచించారు. కారుణ్య నియామక ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులు ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమ కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న తమకు, ఈ ఉద్యోగ అవకాశం కల్పించడం ద్వారా కొండంత అండను ఇచ్చిందని భావోద్వేగానికి లోనయ్యారు. తమకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించడము వలన తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని, తమకు మరియు తమ కుటుంబ సభ్యులకు ఇది ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. ఖాళీలు ఏర్పడిన వెంటనే ఎంతో పారదర్శకతతో, త్వరితగతిన ఈ నియామక ప్రక్రియను పూర్తి చేసినందుకు జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ రావుకి మరియు ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) వి.వి.వి.ఎస్. లక్ష్మణరావు కి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి వి.వి.వి.ఎస్. లక్ష్మణరావు , ఉప ముఖ్యకార్యనిర్వహణాధికారి జి.ఎస్.రామ్ గోపాల్ , ఏ.పి.పిఆర్.ఏం.ఇ.ఏ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.వి.వి రమేష్ , డి విభాగపు పరిపాలనాధికారిగా వి.హెచ్.ఎస్.ఆర్. సుబ్రహ్మణ్యం మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు

## జయప్రదం చేయండి

### జనవరి 4వ తేదీ చలో విశాఖ



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) 18వ అఖిలభారత మహాసభలు విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు జరుగుతున్న మహాసభలు జయప్రదం కావాలని కాకినాడ రూరల్ ఇంద్రపాలెం పంచాయతీ కార్యాలయం ఎదుట పంచాయతీ వర్కర్స్ యూనియన్ కాకినాడ రూరల్ మండలం అధ్యక్షులు వీరభద్రం, సీనియర్ నాయకులు వాసంశెట్టి చంద్రావు జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు కాకినాడ జిల్లా అధ్యక్షులు దువ్వ శేషబాబ్జి, రూరల్ మండల కార్యదర్శి తొట్టిపూడి రాజా, చింతపల్లి అజయ్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో మొదటిసారిగా విశాఖపట్నంలో జరిగే సిఐటియు 18 అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని వాడవాడలా, యూనియన్ లు జెండాలు ఎగరవేయడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులను కట్టు బానిసలుగా మార్చే విధంగా తెచ్చిన 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లు తీసుకురావడానికి వ్యతిరేకంగా కార్మికుల పెద్ద ఎత్తున పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు వ్యతిరేకంగా ఫిబ్రవరి నెలలో జరుగుతున్న దేశవ్యాప్త సభలో కార్మిక, కర్షక విద్యార్థి, యువజన, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జనవరి 4వ తేదీన విశాఖ నగరం ఆర్కే బీచ్ లో జరుగుతున్న భారీ బహిరంగ సభ ర్యాలీలో కార్మికులు, ప్రజలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మురుమల సత్యనారాయణ, మేడిశెట్టి శ్రీనివాస్, వాసంశెట్టి శ్రీనివాస్, పిల్లి త్రిమూర్తులు, మేడిశెట్టి రాజు, కస్తూరి శీను, గీసాల నూకరాజు, ఏల్చూరి శివ, మేడిశెట్టి క్రాంతి, బొచ్చ మారేష్, పంపన శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామానుజన్ జాతీయస్థాయి మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షలో

## ఆదిత్య విద్యార్థుల ప్రభంజనం





**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** నేడు ప్రకటించిన రామానుజన్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షా ఫలితాలలో ఆదిత్య హైస్కూల్ గంగరాజునగర్ విద్యార్థులు జాతీయ స్థాయిలో షేక్ అబ్దుల్ షాహుల్ నవాజ్ (7వ తరగతి) 1వ ర్యాంకును, ధైర్య సుమిత్ రామ (9వ తరగతి) 1వ ర్యాంకును సాధించారు. జిల్లాస్థాయిలో అన్నమదేవర అభిరామ్ (6వ తరగతి) 1వ ర్యాంకును,మోతూరి క్రిష్సన్ (8వ తరగతి) 2వ ర్యాంకును, గుడివాడ వెంకట శివరామ అఖిలేష్ (9వ తరగతి) 1వ ర్యాంకును, దంగేటి రోహిత్ బాబు (10వ తరగతి) 2వ ర్యాంకును సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ జె.మొయినా తెలిపారు. ఈ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, విజయానికి కారకులైన ఉపాధ్యాయులను ఆదిత్య సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి అభినందించారు.

# ఎడిటర్ వాయిస్

## ఉత్తరాంధ్ర ఆకాంక్షలను మోసుకుంటూ ఎగిరే మొదటి విమానం

ఏపీలో ఇపుడు ఉత్తరాంధ్రకు ప్రాముఖ్యత పెరిగింది. ఇక్కడ అనేక ఐటీ పరిశ్రమలు తరలివస్తున్నాయి. అంతే కాదు కీలక ప్రాజెక్టులు సైతం ఈ ప్రాంతాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. అన్నింటి కంటే ఎక్కువగా ఉత్తరాంధ్రలో ఒక అతి పెద్ద అంతర్జాతీయ విమానాశ్రయం రాబోతోంది. ఇది కూడా గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుగా ఉండనుంది. పైపెచ్చు వెనుకబడిన ప్రాంతం అయిన విజయనగరం జిల్లాలోని భోగాపురంలో ఈ ప్రాజెక్ట్ రావడం మరింత ఆసక్తికరం. దాంతో అటు శ్రీకాకుళం ఇటు విజయనగరం కలసికట్టుగా ఎదుగుతాయని అంటున్నారు ఓవరాల్ గా చూస్తే విశాఖ తో పాటు ఉత్తరాంధ్రా జిల్లాలు అన్నీ అభివృద్ధిని పెద్ద ఎత్తున సాధిస్తాయని చెబుతున్నారు.

**అనుకున్న దాని కన్నా :**

ఇక భోగాపురం ఎయిర్ పోర్టు మొదటి దశ పనులు పూర్తి చేయడానికి 2026 జూన్ నెలకు డెడ్ లైన్ గా పెట్టుకున్నారు. ఆ నెలలో ఈ విమానాశ్రయం నుంచి తొలి విమానం ఎగురుతుందని చెప్పుకొచ్చారు. అయితే ఈ విమానాశ్రయ నిర్మాణం శరవేగంగా పూర్తి కావస్తూండడంతో డెడ్ లైన్ కంటే ముందే అంటే మే నెలలోనే తొలి విమానం ఎగురుతుందని లేటెస్ట్ న్యూస్ గా ఉంది. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

**మరింత ముందుకు :**

తొలి విమానం ఎగరడం తోనే అభివృద్ధి సైతం పరుగులు తీస్తుందని అంతా అంటున్నారు. ఎక్కడైనా అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పన చాలా ముఖ్యం. విమానయాన రంగం ద్వారా మరింతగా ఉత్తరాంధ్ర బయట ప్రపంచంతో కనెక్ట్ అవుతుందని భావిస్తున్నారు. మరీ ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయి విమానాల రాకపోకలతో ఎయిర్ ట్రాఫిక్ మరింతగా పెరుగుతుందని కూడా లెక్క వేస్తున్నారు. అదే విధంగా మరో వైపు చూస్తే ఐటీ పరిశ్రమలు, టూరిజం డెవలప్మెంట్, అలాగే ఇతర పరిశ్రమల రాకతో ఉత్తరాంధ్రా ఇంకా ప్రాముఖ్యత పొందుతోంది. ఈ నేపథ్యంలో కలసివచ్చినట్లుగా ఈ ఎయిర్ కనెక్టివిటీ కూడా కుదిరిన పక్షంలో ఉత్తరాంధ్రా అభివృద్ధికి ఆకాశమే హద్దుగా ఉంటుందని అంటున్నారు.

**ఇది కూడా రికార్డే :**

ఎక్కడైనా చెప్పిన సమయానికి కంటే కూడా చాలా లేట్ గా ప్రాజెక్టులు పూర్తి అవుతాయి. అయితే బోగాపురం ఎయిర్ పోర్టు మాత్రం అనుకున్న దాని కంటే శర వేగంగా పూర్తి కావడమే కాకుండా నెల ముందుగానే ఓపెనింగ్ కి నోచుకోవడం అంటే అది రికార్డుగానే చూస్తున్నారు కేంద్రంలో రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వాలు ఉండడం, సివిల్ ఏవియేషన్ మినిస్టర్ కూడా ఉత్తాంధ్రా జిల్లాలకు చెందిన వారు కావడంతోనే ఇది సాధ్యపడింది అని అంటున్నారు. సో ఉత్తరాంధ్ర ఆశలను కలలను ఆకాంక్షలను మోసుకుంటూ తొలి విమానం 2026 మే నెలలోనే ఎగురుతుందన్న మాట. సో ఇది అందరికీ స్వీట్ న్యూస్ గానే చూడాల్సి ఉంది.



ఎడిటర్ : కె.సునీల్ కుమార్

# మాకు భీమిలీ టికెట్ కావాలి



విశాఖ జిల్లాలో భీమునిపట్నం అసెంబ్లీ నియోజకవర్గం కీలకమైనది. ఇపుడు చూస్తే హైదరాబాద్ లో జూబ్లీ హిల్స్ మాదిరిగా ప్రాధాన్యత కలిగిన నియోజకవర్గం గా మారుతోంది. ఐటీ కంపెనీలు అన్నీ ఒకే చోటకు వస్తున్నాయి. నగరం విస్తరించి ముందుకు సాగుతోంది. భోగాపురం ఎయిర్ పోర్టు పూర్తి అయి ఆరు లైన రోడ్డు పడితే ఏవియేషన్ వర్సిటీ వస్తే కనుక భీమిలీ స్వరూపమే మారిపోతుంది అన్న చర్చ ఉంది. ఈ నేపథ్యంలో రాజకీయంగా కూడా భీమిలీ మీద పట్టు సాధించేందుకు అనేక మంది ప్రయత్నాలు చేస్తున్నారు.

**బలమైన సామాజిక వర్గం :**

భీమిలీలో బలమైన సామాజిక వర్గంగా నాగవంశీకులు ఉన్నారు. వీరి జనాభా భీమిలీ పట్టణం, భీమిలీ మండలం, అలాగే పద్మనాభం మండలంలో ఎక్కువగా ఉంది. గతంలో చూస్తే వీరు రాజకీయంగా చక్రం తిప్పుతూ ఉండేవారు. నిజానికి ఈ సామాజిక వర్గం మున్సిపాలిటీగా భీమిలీ ఉన్నపుడు హవా చలాయించేది. కీలక పదవులు అందుకునేది. మండలంలోనూ వారి రాజకీయాలు ఒక స్థాయిలో సాగేవి. అయితే వారి ఆశలు మాత్రం ఎమ్మెల్యే ఎంపీ సీట్లలో నెగ్గలేదు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎమ్మెల్యే టికెట్ అలా :** వాస్తవానికి తెలుగుదేశం పార్టీ పెట్టిన కొత్తలో భీమునిపట్నం ఎమ్మెల్యే టికెట్ నాగవంశీ కుల కే దక్కింది. వారి నుంచి మునిసిపాలిటీలో వైస్ చైర్మన్ గా ఉన్న ఒక నాయకుడికి ఈ టికెట్ ఇవ్వాలని స్వయంగా అధినాయకత్వం నిర్ణయించింది. అయితే మధ్యలో జరిగిన అనేక ఇతర సామాజిక సమీకరణల మూలంగా ఆ టికెట్ జారిపోయింది. అప్పటి నుంచి ఎన్నికలు ఎపుడు వచ్చినా తమకు టికెట్ ఇవ్వాలని నాగవంశీకులు కోరుతూ వస్తున్నారు. తాజాగా భీమిలీలో రాష్ట్ర స్థాయి నాగవంశీకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు డిమాండ్లు వారి నుంచి వచ్చాయి.

**అసెంబ్లీ లేదా పార్లమెంట్ :** నియోజకవర్గంలో బలంగా ఉన్న తమ సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్యే లేదా ఎంపీ టికెట్ ని అర్హులు ఎవరికైనా ఇవ్వాలని వారు కోరుతున్నారు అలాగే విశాఖ కార్పోరేషన్ ఎన్నికల్లో మేయర్ పదవిని తమకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. తమలోనూ అనేక మంది సమర్థులు ఉన్నారని అన్ని సామాజిక వర్గాలకు అవకాశాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఎపుడూ ఒకటి రెండు కులాలకే పదవులు ఇస్తూ పోతే మిగిలిన వారికి సామాజిక న్యాయం జరిగేది ఎపుడు అని వారు నిలదీస్తున్నారు.

**ప్రధాన పార్టీలకే :** నాగ వంశీకుల ఈ డిమాండ్ ప్రధాన పార్టీలకు సవాల్ గా మారనుంది అని అంటున్నారు. దాదాపుగా మూడు లక్షలకు పైగా జనాభా ఉన్న భీమిలీ అసెంబ్లీ ఏపీలోనే అతి పెద్దది. అంతే కాదు ఎన్నో బలమైన సామాజిక వర్గాలు ఉన్నాయి. అయితే వారికి ఎక్కడో ఒకచోట ఎమ్మెల్యే సీటు దక్కుతోంది. కానీ నాగవంశీకులకు మాత్రం ఎకామిడేట్ చేయలేకపోతున్నారు అని అంటున్నారు దాంతో ఈసారి వారు గట్టిగానే పట్టుబడుతున్నారు. స్థానిక ఎన్నికల నుంచి సార్వత్రిక ఎన్నికల దాకా వారు పట్టు పెంచుకోవాలని చూస్తున్నారు. మరి ఇది ప్రధాన రాజకీయ పార్టీలకు సవాల్ అని అంటున్నారు.

గాంధీ పేరు

# తొలగించడం అనైతికం

శశిథరూర్



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకొస్తోంది. ఇందులో భాగంగానే 'వికసిత్ భారత్ రోజ్‌గార్, ఆజీవికా హామీ మిషన్ (గ్రామీణ్) (వీబీ-జీ రామ్ జీ) బిల్లు- 2025ను మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కూడా ఈ బిల్లును వ్యతిరేకించారు. ఈ పథకానికి గాంధీ పేరును తొలగించడం అనైతికమని అన్నారు. అంతేగాక, రాముడి పేరును అపవిత్రం చేయొద్దంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం కూడా థరూర్ ఈ పేరు మార్పుపై ఎక్స్ వేదికగా స్పందించారు. "ఎంజీనరేగా ఎరు మార్చి.. కేంద్రం కొత్తగా జీ రామ్ జీ బిల్లు తీసుకురావడంపై జరుగుతున్న వివాదం దురదృష్టకరం. గ్రామ స్వరాజ్ సిద్ధాంతాలు, రామరాజ్య ఆదర్శాలు ఎన్నటికీ ఒకదానితో ఒకటి పోటీపడేవి కాదు. గాంధీజీ దృక్పథానికి అవి రెండు మూల స్తంభాల్లాంటివి. ఇప్పుడు పథకానికి పేరు మార్చడం అంటే ఆయన ఆదర్శాలను విస్మరించినట్లే. ఆయన వారసత్వాన్ని అగౌరపర్చే ప్రయత్నం చేయొద్దు" అని థరూర్ రాసుకొచ్చారు. శశి థరూర్ గత కొంతకాలంగా కాంగ్రెస్‌తో విభేదిస్తూ మోదీ ప్రభుత్వంపై బహిరంగంగానే ప్రశంసలు కురిపిస్తోన్న సంగతి తెలిసిందే. దీంతో సొంత పార్టీ నేతల ఆగ్రహానికి గురవుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా బిల్లు విషయంలో కాంగ్రెస్‌కు మద్దతుగా మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## టౌన్ హాల్ సేవల ద్వారా దుప్పట్లు పంపిణీ

### సిటీ ఎమ్మెల్యే తనయుడు వనమాడి మోహన్



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో టౌన్ హాల్ చేస్తున్న సేవలు శ్లాఘనీయమని కాకినాడ అర్బన్ శాసనసభ్యులు వనమాడి కొండబాబు తనయుడు వనమాడి మోహన్ అన్నారు .బుధవారం ఉదయం స్థానిక లిటరరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో( టౌన్ హాల్) సుమారు లక్ష యాభై వేలు విలువచేసే షోలాపూర్ దుప్పట్లను 500 మందికి వనమాడి మోహన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ టౌన్ హాల్ కమిటీ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా ఉన్నారని టౌన్ హాల్ కమిటీ సభ్యులను ప్రశంసించారు. చలికాలంలో పేదలకు అవసరమైన షోలాపూర్ దుప్పట్లను పంపిణీ చేసే అవకాశం నాకు కలగజేసినందుకు కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుకున్నారు. కమిటీ అధ్యక్షులు వివిఎన్ సత్యనారాయణ (ఆనంద్) కార్యదర్శి వివి సుబ్రహ్మణ్యేశ్వర రావు (మాస్టర్) ఉపాధ్యక్షులు డివిఎన్ రాజుల స్వీయ పర్యవేక్షణలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యదర్శి మాస్టర్ మాట్లాడుతూ పేదలకు దుపట్ల పంపిణీ కార్యక్రమానికి కమిటీ సభ్యులు సహాయ సహకారాలు అందించాలని వారందరికీ ధన్యవాదాలు తెలుపుకున్నారు. టౌన్ హాల్ కమిటీ ఏ సేవా కార్యక్రమం చేపట్టిన తమ వంతు సహకారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తున్నారని మాస్టర్ అన్నారు. అధ్యక్షులు ఆనంద్ మాట్లాడుతూ త్వరలో టౌన్ హాల్ సభ్యులకు ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించదల్చామని చెప్పారు. దుప్పట్లతోపాటు పళ్ళు బిస్కెట్లు ను కూడా కలిపి అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమాల్లో జీవి రఘునాథ్, టౌన్ తెలుగుదేశం పార్టీ కమిటీ అధ్యక్షులు మల్లిపూడి వీరు బామిరెడ్డి, పైడా శంకర్రావు, సిమకుర్తి బైరవమూర్తి, ఎల్ లక్ష్మణ్ రావు, బీఎస్ కృష్ణ, భగవాన్, గొల్ల బాబుతో పాటు అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు

## మందపల్లి శ్రీ మందేశ్వర స్వామి వారి ఆలయ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ దివ్య క్షేత్రం మందపల్లి శ్రీ మందేశ్వర (శనీశ్వర)స్వామి దేవస్థానం ప్రచురించిన 2026 క్యాలెండర్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాలకమండలి సభ్యులతో కలిసి వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆవిష్కరించారు. స్వామివారి ఆశీస్సులు అందరిమీదా ఉండాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజును ఆలయానికి ఆహ్వానించి చరిత్రలో నిలిచిపోయేలా బ్రహ్మాండమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గౌరవించుకునేందుకు తగిన ఆలోచన చేసి ముందుకు వెళదామని గ్రామస్తులతో ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. అందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని ఆలయ అధికారులకు, గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మందపల్లి ఎంపీటీసీ సిద్ధ శెట్టి వీర వెంకట సత్యనారాయణ, దేవస్థానం మాజీ చైర్మన్ మరియు మాజీ మందపల్లి గ్రామ సర్పంచ్ చింతం కృష్ణ, దేవస్థానం మాజీ చైర్మన్ మరియు మాజీ జెడ్పిటిసి ధరణాల రామకృష్ణ, దేవస్థానం మాజీ చైర్మన్ బండారు సూర్యనారాయణ దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంధం సత్య వెంకట నాగాజీ, గవర వీర వెంకట సత్యనారాయణ, దేవపాటి వెంకటేశ్వర రావు, కొత్తపల్లి నాగ శిరోమణి, అయలూరి శ్రీరామమూర్తి, దేవస్థానం సిబ్బంది పాల్గొనియున్నారు. అనంతరం కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ ని వాడపాలెం కార్యాలయంలో కలిసి దేవస్థానం నూతన సంవత్సర క్యాలెండర్ 2026 ను వారికి అందజేయుట జరిగినదని దారపురెడ్డి సురేష్ బాబు, సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి వారు తెలియజేశారు.

# హెల్త్ వాయిస్

## నిమ్మకాయలు త్వరగా చెడిపోకుండా ఉండాలంటే..

సాధారణంగా, మార్కెట్ నుండి తెచ్చిన నిమ్మకాయలు రెండు రోజుల్లోనే ఎండిపోతాయి. నిమ్మకాయ పైభాగం గోధుమ రంగులోకి మారడం ప్రారంభమవుతుంది. వాటిని తాజాగా ఉంచడం కొంచెం కష్టం. అయితే, ఈ కొన్ని సాధారణ చిట్కాల ద్వారా నిమ్మకాయలు త్వరగా చెడిపోకుండా ఉండాలంటే ఎలా నిల్వ చేయాలో తెలుసుకుందాం.. చాలా మంది వంట నుండి చర్మ సంరక్షణ వరకు ప్రతిదానిలోనూ నిమ్మకాయను ఉపయోగిస్తారు. అందుకే, నిమ్మకాయలను ఎక్కువగా కొంటారు. కానీ, మార్కెట్లో కొన్న నిమ్మకాయలు రెండు రోజుల్లోనే ఎండిపోతాయి. వాటి ఉపరితలం గోధుమ రంగులోకి మారుతుంది. మీరు కూడా అదే సమస్యను ఎదుర్కొంటున్నారా? అయితే, ఈ కొన్ని సాధారణ చిట్కాల ద్వారా నిమ్మకాయలు త్వరగా చెడిపోకుండా ఉండాలంటే ఎలా నిల్వ చేయాలో తెలుసుకుందాం..ఈ విషయాలు గమనించండి. నిమ్మకాయలను ఎక్కువ కాలం తాజాగా ఉంచుకోవాలంటే, ముందుగా మార్కెట్ నుండి సరైన నిమ్మకాయను కొనడం ముఖ్యం. నిమ్మకాయ చాలా గట్టిగా ఉంటే, దానిని కొనకండి. కొంచెం మెత్తగా ఉండే నిమ్మకాయను ఎంచుకోండి. అలాగే, తాజా నిమ్మకాయ మంచి వాసన వస్తుంది. దానిని కొనండి.



**రిఫ్రిజిరేటర్‌లో ఎలా నిల్వ చేయాలి?**

నిమ్మకాయలను ఎక్కువ కాలం తాజాగా ఉంచడానికి, వాటిని నేరుగా రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేయవద్దు. నిమ్మకాయలను బాగా కడిగి శుభ్రం చేయండి. తర్వాత ఒక గాజు సీసాలో నీటిని నింపి, నిమ్మకాయలను కంటైనర్‌లో ఉంచండి. మూత గట్టిగా మూసివేసి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేయండి. మీరు ఈ సలహాను పాటిస్తే, నిమ్మకాయలు త్వరగా చెడిపోవు.

**రిఫ్రిజిరేటర్ లేకుంటే ఎలా నిల్వ చేయాలి?**

ఇంట్లో రిఫ్రిజిరేటర్ లేకపోయినా, నిమ్మకాయలను ఎక్కువ కాలం తాజాగా ఉండేలా చేయవచ్చు. దీని కోసం, మొదట నిమ్మకాయను కడిగి, ఆ తర్వాత తుడిచి ఆపై నిమ్మకాయ ఉపరితలంపై తేలికగా నూనె రాయండి. దీని కోసం మీరు ఆవాల నూనె లేదా నెయ్యిని ఉపయోగించవచ్చు. దీని తరువాత, నిమ్మకాయలను ఒక్కొక్కటిగా టిష్యూ పేపర్‌లో చుట్టి, చల్లని ప్రదేశంలో ఒక కంటైనర్‌లో ఉంచండి. ఈ విధంగా, నిమ్మకాయలు చాలా కాలం పాటు తాజాగా ఉంటాయి.

## ఆరోగ్యానికి మంచివని క్యారెట్స్ పచ్చిగానే తింటున్నారా..

### అలాంటి పొరపాటు చేస్తే సమస్యలు తప్పవంటున్న డాక్టర్



క్యారెట్స్ చాలా మంచివి. అందుకే, వీటిని రెగ్యులర్‌గా డైట్‌లో యాడ్ చేస్తుంటారు. వీటిని తినడం వల్ల ఇమ్యూనిటీ పెరగడం దగ్గర్నుంచీ ప్రమాదకర సమస్యల్ని తట్టుకోగలిగే సామర్థ్యం ఉంటుంది. క్యారెట్స్‌ని అందుకే ఎక్కువగా తీసుకోవాలని చెబుతారు. దీంతో కొంతమంది పచ్చిగానే, సలాడ్స్‌లో తినేస్తుంటారు. కానీ, వీటి వల్ల లేనిపోని సమస్యల్ని తీసుకొస్తున్నారని చెబుతున్నారు. డాక్టర్ చెప్పే ఆ విషయాలేంటో తెలుసుకోండి. పచ్చి క్యారెట్స్ తినడం చాలామందికి అలవాటు. సలాడ్స్ దగ్గర్నుంచీ జ్యూస్‌ల వరకూ ఇలా ఎన్నో రకాలుగా తీసుకుంటారు. అయితే, పచ్చిగా ఎక్కువగా తీసుకోవడం ఇందులోని ఫైబర్ కారణంగా జీర్ణ సమస్యలు ఎక్కువగా వస్తాయి. ఇందులోని గుణాలు ఓరల్ అలర్జీకి కారణమవుతాయి. పచ్చి క్యారెట్స్ తినడం వల్ల ఇందులోని బీటా కెరోటిన్ మన బాడీకి సరిగ్గా అందదు. అందుకే, పచ్చి క్యారెట్స్ తినకూడదని చెబుతారు. దీని గురించి డాక్టర్ మల్లికా ప్రణయ్ ఏం చెబుతున్నారో తెలుసుకోండి.

**పచ్చి క్యారెట్స్ తింటే ఏయే సమస్యలు వస్తాయంటే..**

పచ్చి క్యారెట్స్‌లో బీటా కెరాటిన్ ఉంటుంది. వీటిని తినడం అస్సలు మంచిది కాదు. సలాడ్స్‌లా తీసుకున్నా జ్యూస్‌లా తీసుకున్నా అస్సలు మంచిది కాదు. ఎందుకంటే, క్యారెట్స్‌లో బీటా కెరోటిన్ ఉంటుంది. వీటిని పచ్చిగా తీసుకున్నప్పుడు బాడీకి సరిగ్గా అబ్జార్బ్ అవ్వదు. వాటిని వండి తిన్నప్పుడే మన బాడీకి అబ్జార్బ్ అవుతుంది.

**పచ్చి క్యారెట్స్, జ్యూస్‌లా తీసుకుంటే..**

కొంత మంది పచ్చి క్యారెట్స్‌ని అలానే తీసుకుంటారు. జ్యూస్‌లా తీసుకుంటారు. వీటి వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. అందుకే, అలా తీసుకోవద్దని చెబుతున్నారు ఎక్స్‌పర్ట్స్. వీటి బదులు ఉడికించి తినడం మంచిదని చెబుతారు. ఉడికించడానికి కూడా ఓ పద్ధతి ఉంటుంది. ఎలా పడితే అలా ఉడికించడం కాదు. మనం ఉడికేటప్పుడు కొన్ని పదార్థాలు వేసి ఉడికిస్తే వాటిలోని పోషకాలు పెరుగుతాయి.

**ఏం వేసి ఉడికించాలి?**

క్యారెట్స్‌ని కూరలా చేసి తినొచ్చు. నార్మల్‌గా కాకుండా ఉడికేటప్పుడు కొద్దిగా నీరు లేదా నెయ్యి వేసి ఉడికించి తీసుకోండి. ఇలా ఉడికించి తీసుకుంటే ఎక్కువగా అబ్జార్బ్ అవుతుంది. వీటిని ఎప్పుడైనా కూడా కూరలా వండి తినడం మంచిది. అలా కాకుండా క్యారెట్స్‌ని హల్వాలా కూడా చేసి తినొచ్చు. ఇలా ఉడికించి తింటే చాలా వరకూ బాడీకి పోషకాలు అందుతాయి.

**జీర్ణ సమస్యలు రాకుండా..**

క్యారెట్స్‌లో ఎక్కువగా యాంటీ న్యూట్రియెంట్స్ ఉంటాయి. వీటిని ఉడికించి తినడం వల్ల ఆ యాంటీ న్యూట్రియెంట్స్ తగ్గి త్వరగా డైజెస్ట్ అవుతాయి. లేదంటే కడుపునొప్పి, అజీర్ణం, మలబద్ధకం, ఇతర జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. కాబట్టి, ఎప్పుడైనా సరే క్యారెట్స్‌ని నార్మల్‌గా కాకుండా ఉడికించి తినడం అలవాటు చేసుకోండి.

అంగన్‌వాడీ వర్కర్లకు

# 5జి ఫోన్లు పంపిణీ

**సేవలు మరింత వేగవంతం : ఎమ్మెల్యే వేగుళ్ళ**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగంగా సేవల్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లకు 5జి మొబైల్ ఫోన్లను అందిస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట పట్టణంలో ధర్మగుండం చెరువువద్ద ఉన్న శ్రీ సీతారామ కమ్యూనిటీ హాల్ లో ఐసిడిఎస్ ప్రోజెక్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అంగన్వాడీ వర్కర్లకు 5జి స్మార్ట్ మొబైల్స్ పంపిణీ కార్యాక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ళ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం సరఫరా చేసిన 4జి ఫోన్‌లు సరిగ్గా పనిచేయడం లేదన్నారు. ఇది క్షేత్రస్థాయి నివేదిక, పథకాల అమలును ప్రభావితం చేస్తుందన్నారు. దీని కారణంగా అంగన్వాడీ కార్యకర్తల పని సులభతరం చేసేందుకు కూటమి ప్రభుత్వం శ్యామ్ సంగ్ 5జి ఫోన్లు ను అందించిందన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసేందుకు, ప్రభుత్వ స్కీమ్స్ వారికి చేరవేసేందుకు ఈ ఫోన్లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కానున్నాయన్నారు. 253 మంది అంగన్వాడీ వర్కర్లకు, సూపర్ వైజర్లకు ఈ 5జి ఫోన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షులు మత్సా నాగు, మండల అధ్యక్షులు కర్రి తాతరావు, కుంచె ప్రసాద్, వై.ఆర్.కె.పరమహంస, పుత్సల శ్రీనివాస్, కపిలేశ్వరపురం సర్పంచ్ శాక శ్రీను, 22వ వార్డు కౌన్సిలర్ బి.సరస్వతి, కూటమి నాయకులు, కార్యకర్తలు, కపిలేశ్వరపురం ఎంపిడిఒ, సిడిపిఒ, అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్ వైజర్లు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్ర వెళ్లే వారికి

# రూ.లక్ష సాయం పట్ల హర్షం

**టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముస్లిం హజ్ యాత్రికులు ఒక్కొక్కరికి రూ.లక్ష అందించనున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించడం పట్ల తెలుగుదేశం రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్ హర్షం వ్యక్తం చేశారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్‌కు వెళ్లే వారికే ఈ సాయం అందుతుందని పేర్కొన్నారు.ఆదాయంతో సంబంధం లేకుండా విజయవాడ నుంచి వెళ్లేవారికి రూ.లక్ష అందజేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ మేరకు మైనార్టీ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ముస్లింలకు అత్యంత పవిత్రమైన మక్క హజ్ యాత్ర కు సంబంధించి ఈ సాయం చేయడం తో ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

దిగ్విజయంగా

# హిందూ సమ్మేళన కార్యక్రమం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హిందూ సమ్మేళన నిర్వహణ సమితి, పుర ప్రముఖులు వార్డు కౌన్సిలర్లు హిందూ బంధువులు ఏర్పాటుచేసిన హిందూ సమ్మేళనానికి విశిష్ట అతిథిగా శ్రీ భువనేశ్వరి పీఠం పీఠాధిపతులు శ్రీ శ్రీ కమలానంద భారతి స్వామి వారు విచ్చేసి అనుగ్రహ భాషణం చేయడం జరిగింది ఇందులో ముఖ్యవక్తగా ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగ్ సంఘచాలక్ మంతెన రామచంద్ర రావు, మహిళా వక్తగా ఇరగవరపు పద్మావతి, ఆంధ్ర రాష్ట్ర మహిళ సమన్వయ సంయోజకరాలు వనవాసి కళ్యాణాశ్రమం స్టేట్ మెంబర్, హిందూ సమ్మేళ నిర్వహణ సమితి సభ్యులు హిందూ బంధువులు పాల్గొన్నారు. ఇందులో స్వామీజీ మాట్లాడుతూ హిందువులందరూ ఐక్యమత్యంగా ఉంటూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు అదేవిధంగా దేవాలయాల పరిరక్షణ కోసం కులాలు ప్రాంతాలు పార్టీలు వేరైనా మనమంతా హిందువులు అనే భావంతో జీవించినప్పుడే మన దేశాన్ని ధర్మాన్ని ఆలయాలను కాపాడుకోగలము అని వారు తెలియపరిచారు.

కోనసీమ తిరుమల వాడపల్లి వెంకన్నకు

# భారీ ఆదాయం

**హుండీల లెక్కింపు సందర్భంగా 28 రోజులకు 1.56 కోట్ల ఆదాయం**



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో హుండీల లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి, శ్రీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ హుండీల నుంచి మొత్తం రూ.1,28,07,874లు ఆదాయంగా లభించింది. అన్న ప్రసాదం హుండీల నుంచి రూ.28,23,211 ల ఆదాయం లభించింది. మొత్తం 28 రోజులకు గాను రూ.1,56,31,085 లు ఆదాయంగా లభించినట్లు డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు తెలిపారు. నగదు తో పాటు 27 గ్రాముల బంగారం, 1కేజీ 150 గ్రాముల వెండి కానుకలుగా లభించినట్లు ఆయన తెలిపారు. మొత్తం 10 దేశాలకు చెందిన 43 విదేశీ కరెన్సీ నోట్లు సైతం లభించినట్లు తెలిపారు. హుండీ లెక్కింపుకు పర్యవేక్షణాధికారిగా అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎం.కె.టి.ఎన్.వి ప్రసాద్ తనిఖీదారుగా ఎస్ టి పి టి శ్రీనివాస్, రాజమండ్రి, ఎం సత్యనారాయణ ఈవో వెలిచేరు గ్రూప్ శ్రీ దేవాలయాలు తదితరులు వ్యవహరించారు. అర్చక స్వాములు, గ్రామస్తులు, పత్రికా ప్రతినిధులు, శ్రీవారి సేవకులు, దేవస్థానం సిబ్బంది, హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రశ్నలు వర్షంగా సాగిన మండల పరిషత్ సమావేశం



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండల పరిషత్ సమావేశం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై అధికారులు వివరించాలని అందులో సమస్యలు ఉంటే పరిష్కరించాలని అధికారులకు ఎంపీపీ సూచించారు. మండలంలో పాఠశాలలు కొన్ని గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్నాయని, చర్చిలు, రామాలయం, తుఫాన్ షెల్టర్‌లో తరగతులు నిర్వహిస్తున్నారని, దానివలన ప్రజలకు ఇబ్బందులు ఉన్నాయని, నిరుపయోగంగా ఉన్న పాఠశాలలను పూర్తి చేసి తరగతి గదుల్లో పాఠశాలలు నిర్వహించాలని పలువురు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. విద్యా శాఖ అధికారి కిరణ్ బాబు మాట్లాడుతూ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కొమరగిరిపట్నంలో 500 ఎకరాలు డ్రైన్ నుండి పంట పొలాలు లోకి నీరు పెట్టి పంట పండకుండా చేస్తున్నారని తక్షణమే పరిష్కరించాలని పెచ్చెట్టి వెంకటేశ్వరరావుతో పాటు పలువురు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దార్ నరసింహారావు, డ్రైన్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ సునీత, ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజినీర్ శివరామకృష్ణ సంఘటన స్థలానికి వెళ్లి సమస్యను పరిశీలించి నీరు పెడుతున్న వ్యక్తి పై రైతులను అడిగి తెలుసుకున్నారు. కొందరు ఆక్వా చెరువులు తవ్వడానికి ప్రయత్నం చేస్తున్నారని, మరికొందరు వరి పంట పొలాలు సాగు చేయడానికి సిద్ధం అవుతున్నారని గుర్తించారు. తక్షణమే పంట పొలాల నీరు డ్రైన్‌లోకి వెళ్లే లాగా చర్యలు చేపట్టారు. కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన కడలి ప్రభాకరరావు పై రైతులు ఫిర్యాదు చేశారు.తక్షణమే అతని పై చర్యలు తీసుకుని వరి పంట పొలాలు సాగు చేసేందుకు చూడాలని అధికారులకు వినతిపత్రం అందించారు. ఇరిగేషన్,డ్రైన్ శాఖ ఏ ఈలు శివరామ కృష్ణ సునీత, పంట పొలాలలోకి డ్రైన్ నీరు పెడితే మాకు వెంటనే సంచారం అందించాలని అతని పై కేసు నమోదు చేయమని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తామని రైతులు పక్షాన ఉంటామని హామీ ఇచ్చారు.అలాగే ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాల పై వివరించారు.ప్రతి శాఖ అధికారి పై ప్రజా ప్రతినిధులు ప్రశ్నల వర్షం కురిపించారు. ఏ శాఖ అధికారి ఎవరో కూడా ప్రజా ప్రతినిధులకు తెలియనట్టు గా మండల వివిధ శాఖల అధికారులు పేర్లు కూడా చెప్పకుండా సమావేశంలో మాట్లాడటం హాస్యానికి గురి చేసింది. ఇంజినీరింగ్ అసిస్టెంట్ మాట్లాడుతూ ఫేజ్ 1లో సుమారు రెండు కోట్ల పది లక్షల రూపాయలు,ఫేజ్ 2లో 35 లక్షల రూపాయలు పనులు,ఫేజ్ 3 లో 17 రకాల పనులకు సుమారు ఒక కోటి 94 లక్షల రూపాయలు తో పనులు చేపట్టామని అందులో 16 రకాల పనులు పూర్తి అయ్యాయని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుష్మ మాట్లాడుతూ డిసెంబర్ 21న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నమని అందరూ వినియోగించుకునిలా తెలియజేయాలని కోరారు. క్యాన్సర్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరు చేయించుకోవాలని తెలిపారు. ఎన్ఆర్ఈజిఎస్ ఏపీఓ మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి 1696 పనులకు తీర్మానాలు రావాలని, దీని నిమిత్తం 12 కోట్లు రూపాయలు వెచ్చించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఏఓ శర్మ తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించాలని ప్రజాప్రతినిధులను కోరారు. మొత్తానికి సమావేశం ప్రశ్నలతో హోరెత్తింది అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గౌరీ కుమారి,వైస్ ఎంపీపీలు వడ్డీ గంగ,ముత్యాల రామకృష్ణ, ఎమ్మార్వో నరసింహరావు, మండల వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలతో స్నేహపూర్వక ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను నెలకొల్పాలి

**రూరల్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రఘువీర్ వార్షిక తనిఖీలు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** పోలీసులు ఎల్లవేళలా ప్రజలతో స్నేహపూర్వక సత్సంబంధాలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ ను నెలకొల్పాలని రామచంద్రపురం పోలీస్ సబ్ డివిజన్ డీఎస్పీ రఘువీర్ అన్నారు.మండపేట రూరల్ పోలీస్ స్టేషన్ లో బుధవారంరామచంద్రపురం డీఎస్పీ బి. రఘువీర్ వార్షిక తనిఖీ నిర్వహించారు.పోలీస్ స్టేషన్ రికార్డులు కేసు డైరీలు, క్రైమ్ రిజిస్టర్, పెండింగ్ కేసుల ఫైళ్ళు పరిశీలించారు.పరిపాలన సిబ్బంది హాజరు రిజిస్టర్, విధి నియామక పట్టికలు, డ్యూటీ రోస్టర్లు తనిఖీ చేశారు. దర్యాప్తు స్థితి పెండింగ్ దర్యాప్తుల పురోగతి, నిందితుల అరెస్టులు, కోర్టు హాజరు స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు.శాంతి భద్రతలు ఇటీవల జరిగిన సంఘటనలు, నేర నిరోధక చర్యలు, పహారా బృందాల పనితీరు పరిశీలించారు.తనిఖీల అనంతరం డీఎస్పీ పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, నేర నిరోధక చర్యలను మరింత బలోపేతం చేయాలన్నారు.పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తులను త్వరితగతిన పూర్తి చేసి, నిందితులకు వేగంగా న్యాయస్థానాల్లో శిక్షలు అమలయ్యే విధంగా కృషి చేయాలనీ ఆదేశించారు.శాంతి భద్రతల పరిరక్షణలో మెలకువగా, సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతి ఫిర్యాదును సమయానుకూలంగా, న్యాయబద్ధంగా పరిష్కరించాలనీ చెప్పారు. పోలీస్ స్టేషన్లలో శుభ్రత, ఫిర్యాదుల దారుల సమస్యల పరిష్కారంలో పారదర్శకత,పోలీస్ సిబ్బందిలో క్రమశిక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలనీ పేర్కొన్నారు.పోలీస్ సిబ్బంది సంక్షేమంపై దృష్టి సారించి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు.స్టేషన్ లో పోలీస్ లు పనితీరు సంతృప్తికరంగా ఉంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సి ఐ దొర రాజు, ఎస్సై. వి. కిషోర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# విజయ దుర్గా పీఠంలో వైభవంగా వెంకటేశ్వర కళ్యాణం



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాక గ్రామంలో గల విజయదుర్గా పీఠం లో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణం బుధవారం ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి గాడ్ సహస్ర చంద్ర దర్శనం వేడుకలు పురస్కరించుకుని రెండవ రోజు తిరుపతి చెందిన వైఖానస వేద పండితుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశ్వక్సేన పూజ పుణ్యాహవాచనం రక్షాబంధనం సజ్జు అంకురార్పణ అగ్ని ప్రతిష్ట మధూపరక సమర్పణ కన్యాదానం మాంగల్య పూజ మాంగల్య ధారణ తలంబ్రాలు తదితర పూజలు నిర్వహించి శాస్త్రోక్తంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం నిర్వహించారు.

**గాడ్ ఆశీస్సులు పొందిన టీటీడీ ప్రధాన అర్చకుడు**

తిరుమల తిరుపతి దేవస్థాన ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు విజయదుర్గ పీఠంలో వెంకటేశ్వర స్వామి కళ్యాణం కార్యక్రమంలో వేణుగోపాల్ దీక్షితులు పాల్గొని బుధవారం పూజలు నిర్వహించారు. విజయదుర్గ అమ్మ వారికి అర్చనలు, హారతులు నిర్వహించిన అనంతరం పీఠాధిపతి గాడ్ ఆశీస్సులను ఆయనపొందారు. ఈ సందర్భంగా తిరుమల నుంచి తీసుకువచ్చిన



స్వామివారి తీర్థ, ప్రసాదాలను గాడ్‌కు అందజేసి వేదాశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో విజేత సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కర్ నారాయణ, సత్య వెంకట కామేశ్వరి, పెదపాటి శ్రీనివాసమూర్తి, సత్య కనకదుర్గ, బలిజేపల్లి రమ, విజయదుర్గా పీఠం అడ్మినిస్ట్రేటర్ వివి బాపిరాజు, బుజ్జి, వీఆర్వో బాబి, గూడూరుకు చెందిన సాయి సత్సంగం ఆధ్యాత్మిక గురువు ఆదిశంకర్లో భక్తులు పాల్గొన్నారు.

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా

# విద్యార్థులకు పలు పోటీలు

**విద్యుత్ శాఖ రాయవరం ఏఈ సందాక శ్రీనివాసులు**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇంధన పొదుపు అలవాటును ప్రోత్సహించి, భవిష్యత్ తరాలకు మెరుగైన భవిష్యత్తును అందించాలనే లక్ష్యంతో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, వ్యాసం రచన పోటీలను నిర్వహించినట్లు విద్యుత్ శాఖ రాయవరం ఏఈ సందాక శ్రీనివాసులు పేర్కొన్నారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో గల రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఇంధన పొదుపు పై ఏఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమంలో భాగంగా పలు పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా డిసెంబర్ 14 నుండి 20 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. విద్యుత్ వృధాను అరికట్టడం, సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించడం, ప్రజలలో అవగాహన పెంచడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. పాఠశాల విద్యార్థులకు అవగాహన పెంచే క్రమంలో వ్యాసరచన, వృక్తత్వ, చిత్రలేఖనం, క్విజ్ వంటి పలు పోటీలు నిర్వహించి బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత, విద్యుత్ శాఖ ఉద్యోగులు శ్రీకాంత్, మురళీకృష్ణ, తదితర సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మైనింగ్ అక్రమాలపై ఉక్కుపాదం

**సరైన అనుమతులు లేని వాహనాలు సీజ్**



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** తుంగపాడు నుండి మండపేట వైపుగా అక్రమ గ్రావెల్ రవాణాను రూరల్ పోలీసులు అడ్డుకట్టా వేశారు. రూరల్ సిఐ దొర రాజు తెలిపిన వివరాలు ప్రకారం మండపేట రూరల్ ఎస్ఐ వి.కిషోర్ బుదవారం రాత్రి వాహనాలు తనిఖీ చేపట్టారు. మండపేట మండలం లోని ద్వారపూడి శివారు వేములపల్లి వద్ద తన సిబ్బంది తో వాహనాల తనిఖీ చేశారు. అదేక్రమంలో రాజనగం మండలం తుంగపాడు నుండి మండపేట వైపు కు వస్తున్న గ్రావెల్ టిప్పర్ లను తనిఖీలు చేశారు. సంబందిత అనుమతి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఏడు టిప్పర్ లను అక్కడికక్కడే సీజ్ చేసి వాహనాలను ఇప్పనపాడు రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలించామని తెలిపారు. సంబధిత మైనింగ్ అనుమతి బిల్లులు ప్రతి ట్రిప్ కు ఉండాలని పేర్కొన్నారు. అమలాపురం మైనింగ్ శాఖ కు వాహనాలను అప్పగిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మండపేట రూరల్ సిఐ పి.దొరరాజు మాట్లాడుతూ అనుమతులు లేకుండా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

చదువే మీ జీవితాల్లో

# వెలుగులు నింపుతుంది

**రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్**



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** చదువే మీ జీవితాల్లో వెలుగులు నిపుతుందని,చదువుపట్ల అశ్రద్ధ చేయవద్దని విద్యార్థులకు సిఐ ప్రశాంత్ కుమార్ సూచించారు.బుధవారం అల్లవరం గోడి గురుకుల పాఠశాలలో ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలైతే మీ బంగారు భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకుని కలలు కంటున్న మీ తల్లితండ్రుల కలలు కలలుగానే మిగిలి పోతాయని,అంతే కాకుండా మీ భవిషత్తు పాడు అవుతుందని, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ క్రైమ్‌పై సిఐ ప్రశాంత్ కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై సంపత్ కుమార్ మాట్లాడుతూ మీ స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ప్రిన్సిపాల్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నక్కా శ్రీనివాస్, ఉపాద్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సినీ నటి వాసుకీ (పాకీజా)ను ఆదుకుంటాం..

**ఎమ్మెల్యే సత్యానందరావు**



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు సినిమాలలో వెలుగు వెలిగి నేడు దీన స్థితిలో ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక గ్రామంలోని రిటైర్డ్ తహసిల్దార్ జల్లి కేశవరావు ఆర్థిక సహకారంతో నడపడుతున్న శ్రీరామ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న నటి వాసుకీ (పాకీజా) ఆదుకుంటామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. బొబ్బర్లంక లోని ఆశ్రమానికి ఎమ్మెల్యే సత్యానందరావు వెళ్లి ఆమెను పరామర్శించారు.ఒకప్పుడు 60కి పైగా తెలుగు సినిమాల్లో నటించి, తన కామెడీతో ప్రేక్షకులను అలరించిన ఈ మహానటి, నేడు వృద్ధాశ్రమంలో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తంచేశరు అయితే వయస్సు, ఆరోగ్య సమస్యలు,ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రస్తుతం తీవ్ర కష్టాల్లో ఉన్నారన్నారు.ఆమె పరిస్థితి తెలుసుకున్న మెగాస్టార్ చిరంజీవి కుటుంబం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనకు అండగా నిలిచారని ఆమె తెలిపారన్నారు.ప్రస్తుతం నటి వాసూకీ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం, బొబ్బరలంకలోని శ్రీరామ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆమె కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కలిసి, ఇక్కడ జీవించేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని వినతిపత్రం అందజేశారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్వయంగా పాకీజా ఉంటున్న వృద్ధాశ్రమానికి వెళ్లి ఆమెను పరామర్శించి.ఈ సందర్భంగా ఆయన కొంత ఆర్థిక సహాయం అందించి, శాలువాతో సత్కరించారు. అలాగే పాకీజాకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, అవసరమైన సహాయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్రేయపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణం రాజు, ముళ్ళపూడి భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

# లంచం కొట్టు బ్యాంకు రుణం పట్టు

**యానిమేటర్‌ల పనితీరుపై మండిపడుతున్న నాయకులు**



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రతి డ్వాక్రా మహిళలను లక్షాధికారి చేయాలని ఉద్దేశంతో ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు పలు సంక్షేమ పథకాలు అమలుచేసేందుకు ప్రభుత్వానికి డ్వాక్రా మహిళలకు వారధిగా యానిమేటర్‌లను ప్రభుత్వం నియమించింది. ప్రతి యానిమేటర్‌కు గౌరవ వేతనంగా 8 వేలు రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుంది. అయితే బ్యాంకులో అకౌంట్ ఓపెన్ చేయడానికి, తీర్మానాలు రాయడానికి, బ్యాంకు రుణాలు సిఫార్సుకు డ్వాక్రా మహిళ సభ్యులు నుండి యానిమేటర్‌లు ఉన్నత అధికారులు పేర్లు చెప్పి ప్రతి సభ్యురాలు దగ్గర లంచంగా అధిక మొత్తంలో తీసుకుంటున్నారని, ఇవ్వకపోతే తీర్మానాలు రాయడం లేదని మండల పరిషత్ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పెచ్చెట్టి వెంకటేశ్వరావు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. విచారణ చేసి చర్యలు చేపట్టాలని మొత్తుకుంటున్న లంచం తీసుకోవడం మానడం లేదని, పై స్థాయి అధికారులు కూడా స్పందించడం లేదని అధికారులను నిలదీశారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఏపీఎం చెప్పారు.

బోడసకుర్రు దేవర్లంకలో

# ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం బోడసకుర్రు దేవర్లంక షాలోమ్ హౌస్ అఫ్ ప్రేయర్ మందిర 6వ వార్షికోత్సవం, సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగినవి. స్థానిక సంఘ కాపరి రెవ. కె. ఎస్ ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు గ్రామస్థులు మండలం లోని పలువురు దైవజనులు పాల్గొని క్రీస్తుని ఘనంగా ఆరాధించరు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా అమలాపురం రూరల్ సర్కిల్ ఇనెస్పెక్టర్ డి. ప్రశాంత కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామస్థులందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేసారు. ప్రజలందరూ ఎదుటవారి సంతోషంలో మనం సంతోషంగా చూడగలిగినపుడే అందరం సంతోషం గా జీవిస్తామని ప్రజలందరూ బేధభిప్రాయాలూ లేకుండా కలిసి బ్రతకాలని హితబోదచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు,ఆరవ పూర్ణచంద్రరావు (చంటి),ముత్యాల బాబీ, మండల నాయకులు నాతి శ్రీనివాసరావు. జల్లి శ్రీనివాసరావు. బొంతు శ్రీను,అంబటి శ్రీను, దొమ్మటి రాధాకృష్ణ, కోలా ధర్మరాజు, జల్లి రాధా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 21న పల్స్ పోలియోను విజయవంతం చెయ్యండి : వెంకటరావు



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈనెల 21న జిల్లా వ్యాప్తంగా జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రణాళిక ప్రకారం పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 21 ఆదివారం పోలియో దినం నిర్వహణపై డీఆర్వో వెంకటరావు, వైద్య ఆరోగ్యం, పాఠశాల విద్య, ఐసీడీఎస్, మున్సిపల్ కార్పొరేషన్, మెప్మా, పోలీస్ ఇతర శాఖల అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ జె.నరసింహ నాయక్ జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం సజావుగా జరిగేందుకు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా చేపడుతున్న కార్యకలాపాలను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా డీఆర్వో వెంకటరావు మాట్లాడుతూ పోలియోను అంతమొందించే లక్ష్యంతో భారత ప్రభుత్వం ఈనెల డిసెంబరు 21న తలపెట్టిన పల్స్ పోలియో కార్యక్రమం కాకినాడ జిల్లాలో విజయవంతం అయ్యేందుకు అధికారులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. ఇందుకు దుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. డిసెంబర్ 21, ఆదివారం పోలియో బూతులతో పాటు, సోమ, మంగళ రెండు రోజులు పాటు ప్రతి ఇంటిని విజిట్ చేయాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 0–5 సంవత్సరాలలోపు ఉన్న సుమారు 1.94 లక్షల చిన్నారుల కోసం 1,332 పోలియో బూత్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 61 మొబైల్ టీమ్స్ అందుబాటులో ఉంచడం జరిగిందని,130 రూట్ ఆఫీసర్లను నియమించడం జరిగిందన్నారు. ఈ పల్స్ పోలియో కార్యక్రమం జిల్లాలో సజావుగా జరిగేందుకు వైద్య ఆరోగ్యశాఖ నుంచి 1,302 పారామెడికల్ స్టాఫ్ను, 1442 మంది ఆశా వర్కర్లను, 1968 మంది అంగన్వాడీ సిబ్బందిని, 656 మంది ఉపాధ్యాయులు నర్సింగ్ స్టూడెంట్స్, ఇతర వాలంటీర్లను అందుబాటులో ఉంచడం జరిగిందని డిఆర్ఓ తెలిపారు. ప్రాముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని స్లమ్ ఏరియాలు, నూతనంగా ఏర్పడిన హౌసింగ్ కాలనీలు, మత్స్యకార ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి 0–5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి పోలియో రెండు చుక్కలు వేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మండల కేంద్రాల్లో మైక్ అనౌన్స్మెంట్, గ్రామస్థాయిలో టామ్ టామ్ ద్వారా పోలియో కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. పోలీస్ శాఖ ద్వారా పోలియో బూత్ల వద్ద ఎటువంటి సమస్యలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. పాఠశాల విద్యార్థులతో గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఐసీడీఎస్, పంచాయితీ, మున్సిపల్ కార్పొరేషన్, విద్యుత్తు, డీఆర్డీఏ, మెప్మా, దేవాదాయ, డీసీహెచ్ఎస్ శాఖల అధికారులు ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టిపెట్టి, తమకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని డీఆర్వో అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన అధికారులతో పల్స్ పోలియో కార్యక్రమంపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డబ్ల్యూహెచ్ఓ ఎస్ఎంవో జాన్ జుబే జాషువా, ఎస్బి డీఎస్పీ సత్యనారాయణ, డీఐవో సుబ్బరాజు, ఐసీడీఎస్ పీడీ సీహెచ్.లక్ష్మి, ఎంహెచ్ఓ పృథ్వీ చరణ్, సామర్లకోట, పెద్దాపురం మున్సిపల్ కమిషనర్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టమస్ వేడుకల్లో పాల్గొన్న

# ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

### ఘన స్వాగతం పలికిన నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి సుభాష్



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే పండగ క్రిస్మస్ అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం వజ్రకూటం గ్రామంలో పాస్టర్ రావుల క్రిస్టియన్ రాజు, పాస్టరమ్మ ఎలిజిబిత్ రాణి ఆధ్వర్యంలో గ్రామ మాజీ సర్పంచ్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్ సౌజన్యంతో ఏసు సన్నిధి ప్రార్ధన మందిరంలో బుధవారం నిర్వహించిన క్రిస్టమస్ వేడుకల్లో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలోని క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, క్రిస్టమస్ పండుగ శాంతి, ప్రేమ, ఐక్యతకు ప్రతీక అని అన్నారు. మనం ఎదుటివారికి సేవ చేస్తే వారి తిరిగి మనకు సేవ చేస్తారని, తోటి వారిని ప్రేమించాలని, శాంతి, సహనం, మానవసేవే మాధవ సేవగా క్రీస్తు బోధనల ద్వారా తెలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర టిఎన్టియుసి ఉపాధ్యక్షులు డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు(శివ), టీడీపీ సీనియర్ నాయకులు పర్వత సురేష్, గ్రామ పెద్దలు సకురు విష్ణుమూర్తి, కండిపిల్లి సూరిబాబు, కీర్తి రాజు, కీర్తి దొరబాబు, వాసంశెట్టి అర్జున్, కేళంగి నాగేశ్వరావు, కీర్తి నాగేశ్వరావు, కీర్తి రామకృష్ణ, మోర్త ప్రకాశరావు, బత్తిన జాన్, పిల్లా అప్పారావు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పండూరు గ్రామంలో సిసి రోడ్లు నిర్మాణానికి

# శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** సుమారు 38 లక్షలు నిధులతో ఆరు సిసి రోడ్లకు ఎమ్మెల్యే పంతం నానాజీ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. కాకినాడ రూరల్ మండలం పండూరు గ్రామంలో ఎన్ ఆర్ జి ఎస్ 38 లక్షల రూపాయల నిధులతో ప్రజలకు అవసరమైన చోట్ల సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టడం జరిగింది. అలాగే ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లో ముందు ఉన్నారని అన్నారు. అలాగే సర్పవరం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనంతలక్ష్మి త్రిమూర్తులు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, డైరెక్టర్ కడలి ఈశ్వరి, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు చెరుకూరి రామ్ కుమార్, వైస్ ఎంపీపీ వీరిసా సత్తిబాబు, కార్యదర్శి రామ్మోహన్ చౌదరి,కూటమి నాయకులు నురుకుర్తి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాస్ బాబాబాబా, చప్పిడి వెంకటేశ్వరరావు, రంబాల వెంకటేశ్వరరావు, నందూరి సత్తిబాబు, రామకృష్ణ,తాటికాయలు వీరబాబు, మాదారపు తాతాజీ, కోట నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# పౌరుడూ బాల్య వివాహాలను నివారించాలి

### శంఖవరం ఐసిడిఎస్ పిఓ పర్వత వెంకటలక్ష్మి



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత దేశంలో బాల్య వివాహాలను చేయడం ఓ సాంఘిక దురాచారం. ఇది బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం నిషేధం. బాల్య వివాహాలను చేయడం చట్టరీత్యా నేరం. బాల్య వివాహాలను నివారించడానికి ప్రతీ పౌరుడూ, పౌరురాలూ విధిగా నిరంతరం కృషి చేయాలని శంఖవరం ఐసిడిఎస్ పిఓ. పర్వత వెంకటలక్ష్మి పిలుపును ఇచ్చారు. బాల్య వివాహాలను సమూలంగా నివారించాల్సిన నైతిక బాధ్యత దేశంలోని పౌరులు అందరిపైనా ఉందని ఆమె వివరించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడిలోని జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీనిలో ముఖ్య వక్తగా పర్వత వెంకటలక్ష్మి మాట్లాడారు. బాల, బాలికలను స్నేహ పూరితమైన వాతావరణంలో తీర్చి దిద్దడంలో ప్రతీ ఒక్కరూ భాగ స్వామ్యం కావాలి అన్నారు. బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, సంరక్షణ, అభివృద్ధికి బాల్య వివాహాలు ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను కూడా దూరం చేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారిణి జాగారపు విజయ మాట్లాడుతూ ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహించినా, అందుకు ఎవరు సహకరించినా, 18 సంవత్సరాల వయసు నిండని యువతులకు, 21 సంవత్సరాల వయసు నిండని యువకులకు వివాహం చేసినా అందుకు బాధ్యులపై బాల్య వివాహాల నిషేధ చట్టం 2006, పోక్సో చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఐసిడిఎస్ కత్తిపూడి సెక్టార్ సూపర్వైజర్ బి.వెంకట రజిని మాట్లాడుతూ బాలల విద్య, భద్రత కోసం ప్రతీ పౌరుడు గళాన్ని వినిపించాలని, బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్ సాకారానికి మద్దతు ఇవ్వాలని అన్నారు. శంఖవరం మండల న్యాయ సేవా సాధికారిక సంస్థ పానల్ అడ్వకేట్ కూచిమంచి సూర్య ప్రకాష్ రావు మాట్లాడుతూ విద్యార్థులకు చట్టాలపై అవగాహన, బాల్య వివాహం చేస్తే ఎటువంటి శిక్షలు పడతాయని వివరించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ, మానవ హారం, ర్యాలీని చేసారు. ఈ కార్యక్రమంలో పానల్ అడ్వకేట్ బి.మధుబాబు, పారా లీగల్ వాలంటీర్ సి.హెచ్. రాంబాబు, గ్రామ మహిళా సంరక్షణా కార్యదర్శి జర్తా వెంకటలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా బస్తాలను అందించిన

# ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వారి ఆలోచనలతో రైతులకు అండదండలుగా ఉంటున్నారని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. కాకినాడ రూరల్ మండలం పండూరు గ్రామంలో గల సొసైటీ వద్ద రైతులకు యూరియా బస్తాలను సొసైటీ అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు రామ్ కుమార్ మాట్లాడుతూ అలుపెరగని నాయకుడు మన ఎమ్మెల్యే పంతం నానాజీ అని ఆయన నిరంతరం ప్రజల కోసం కృషి చేస్తున్నారని అభివృద్ధి కోసం పరుగులు తీస్తున్నారని ఆయన మన నియోజకవర్గానికి ఎమ్మెల్యే కావడం మనందరి అదృష్టమని అన్నారు. ముందుగా రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ కడలి ఈశ్వరి, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి త్రిమూర్తులు, టిడిపి నాయకులు పెంకె శ్రీనివాస బాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, బిజెపి నాయకులు రంబాల వెంకటేశ్వరరావు, బొలిశెట్టి వెంకట రామకృష్ణ, పెండెం సత్యనారాయణ, వైస్ ఎంపీపీ వీరిసా సత్తిబాబు, కార్యదర్శి మోహన్ చౌదరి, ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, బిజెపి జనసేన పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు నందూరి సత్తిబాబు, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు గరగ శ్రీనివాస్, ఎంపీటీసీ నందిపాటి వెంకట శ్రీనివాస్, నాయకులు గరగా విజయ శ్రీ భాస్కరరావు, గరగ ప్రభాకర్ రావు, నక్క వెంకటరాజు, సిద్ధ భద్రరావు, సూరిబాబు, మాదారపు తాతాజీ, అధికారులు గ్రామస్తులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేణుమాధవస్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకలు ప్రారంభం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పవిత్రమైన ధనుర్మాసం ప్రారంభమైన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని పల్లెలు, పట్టణాలు, నగరాల్లో ఎక్కడికక్కడ నగర సంకీర్తన ఉత్సవాల నిర్వహణ సంప్రదాయం జోరందుకుంది. దీనిలో భాగంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడిలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని వేణు మాధవస్వామి ఆలయంలో నగర సంకీర్తనను బుధవారం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురష్కరించుకుని ఆలయ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు కేళంగి నూకరాజు ఆధ్వర్యంలో ఆలయ పూజారి సత్యనారాయణశర్మ, త్రినాధ శర్మ ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం నగర సంకీర్తనను ప్రారంభించారు. వేణుమాధవ స్వామిని ఆలయ పూజారి సత్యనారాయణ శర్మ ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు నూకరాజు మాట్లాడుతూ నెల రోజుల పాటు స్వామి వారి ఉత్సవ మూర్తిని పల్లకీలో ఆశీనులు గావించి, హరే రామ హరే రామ, రామ రామ హరే హరే, హరే కృష్ణ హరే కృష్ణ, కృష్ణ కృష్ణ హరే హరే నామస్మరణతో వీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహిస్తా మన్నారు. సూర్యోదాయానికి ముందుగానే నగర సంకీర్తన ముగుస్తుంది అన్నారు. గత 10 ఏళ్ళుగా ఈ మహోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. చలిని సైతం లెక్కచేయకుండా పిల్లలు, పెద్దలు, మహిళా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని, ప్రజల్లో ఆధ్యాత్మిక భావనలు పెరుగుతున్నా యనడానికి నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తుల సంఖ్యే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కేళంగి పేర్రాజు, కేళంగి జనార్ధన్, కేళంగి శివాజీ, జీలకర్ర త్రిమూర్తులు, జీలకర్ర చక్రకామేశ్వరరావు, కరణం వీరబాబు, సామినేడి గంగారావు, గాబు వెంకటరమణ, గాబు చిన్ని, ఓరుగంటి స్వామి మహిళలు, గ్రామస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి నోచుకోని పెదమల్లాపురం గిరిజన ప్రాంతం

### ప్రత్యేక గిరిజన మండలం ఏర్పాటు ఆవశ్యం – సమత సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెబ్బాప్రగడ రవి



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తరతరాలు మారినా కాకినాడ జిల్లాలోని మైదాన ప్రాంత గిరిజన బ్రతుకులు మారలేదని సమత స్వచ్ఛంధ సంస్థ ఎగ్జికటివ్ డైరెక్టర్ రెబ్బాప్రగడ రవి ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనలు ప్రభుత్వంతో చేస్తున్న పోరాటాల ఫలితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పెదమల్లాపురంలో ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆలోచించడం హర్షణీయం అంటూ అందుకు కృషి చేసిన ప్రజా ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలోని పెదమల్లాపురం, ధారమల్లాపురం, వేళంగి, స్పందన సంస్థ కూడలి, పోలవరం గిరిజన గ్రామాలను ఆయన బుధవారం సందర్శించారు. 1990 దశకంలో పెదమల్లాపురం కేంద్రంగా సమత స్వచ్ఛంధ సేవా సంస్థను నిర్వహించి, ఆపై నక్సలైట్ల హెచ్చరికలతో సంస్థను పాడేరుకు తరలించుకు పోయిన రెబ్బాప్రగడ రవి ఆ తర్వాత ఈ రెండున్నర దశాబ్దాల కాలంలో పెదమల్లాపురం ప్రాంతాలను సందర్శించడం ఇది రెండో సారి. ఈ సందర్భంగా ఇక్కడి గ్రామాల పెద్దలు, పెదమల్లాపురం గిరిజన ప్రత్యేక మండల సాధన కమిటీ ప్రతినిధులతో చర్చించారు. అనంతరం ఆయన మీడియా ప్రకటనను విడుదల చేశారు. ఆ ప్రకటన అంశాలు ఇలా ఉన్నాయి. సమత ఇక్కడ పని చేసిన 1990–1997 కాలంలో సంస్థ తరఫున పెద్దమల్లాపురం కేంద్రంగా ప్రత్యేక గిరిజన మండలం ఏర్పాటు ప్రతిపాదన చేపట్టాం.1994 లో ఎన్నికల్లో బ్యాలెట్ బాక్సుల్లో ఓట్లతోపాటు పెదమల్లాపురం కేంద్రంగా ప్రత్యేక గిరిజన మండలం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ విజ్ఞాపన చిట్టీలను వేసారు. తర్వాతి పరిణామాల నేపథ్యంలో గిరిజనులు ఈ డిమాండును పక్కన పెట్టేశారు. అప్పటి నుంచి ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదు. రంపచోడవరంలోని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటిడిఏ) తాను చేపడుతూన్న ప్రజాభివృద్ధి పథకాలను ఈ ప్రత్తిపాడు నియోజకవర్గంలోని గిరిజనులకు మంజూరు చేయడాన్ని విస్మరించింది. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సమత కోరుతోంది. ఈ గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయాలనేది ఇప్పటి అత్యవసర అంశంగా మారింది. దశాబ్దాలుగా గిరిజనులు నివసిస్తున్న ఈ ప్రాంతం సహజ వనరులతో సంపన్న మైనప్పటికీ, ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు మాత్రం పూర్తిగా అందని పరిస్థితి నెలకొంది. షెడ్యూల్ ప్రాంత గిరిజనులు, మైదాన ప్రాంత గిరిజనుల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు ఒక్కటే అయినా, హక్కులు, సంక్షేమ పథకాలు, రిజర్వేషన్ల అమలు విషయంలో ప్రభుత్వాల విధానపరమైన తీవ్ర అసమానతలు కొనసాగుతు న్నాయి. సమత ఈ ప్రాంతం నుంచి మారిన తర్వాత ఈ ప్రాంతంలో విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, రవాణా సౌకర్యాలు, ఉపాధి అవకాశాల కల్పన ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉన్నాయి. యువత చదువు మధ్యలోనే మానేయాల్సి రావడం, ఉపాధి లేక వలసలు వెళ్లడం సాధారణ మైపోయింది. వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల ఆధారంగా జీవించే గిరిజనులకు సరైన మద్దతు ధరలు, మార్కెటింగ్ సౌకర్యాలు లేకపోవడం వల్ల ఆర్థికంగా మరింత వెనుకబడు తున్నారు. అందువల్ల పెద్దమల్లాపురం గిరిజన ప్రాంతాల సముదాయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలంటే ఇక్కడ విద్యావంతులైన యువతీ, యువకులకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరులో ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రభుత్వం చర్యలను తీసుకోవాలి. ప్రత్యేక గిరిజన మండలం ఏర్పాటు చేయాలి. ముఖ్యగా ఇక్కడ గిరిజన ప్రజలు కోరుతున్న ప్రకారం ఈ ప్రాంతాలను ఐటీడీఏ పరిధిలోకి తీసుకురావడం, విద్యా, వైద్య, వసతి, మౌలిక సదుపాయాల విస్తరణ, గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి పథకాలు మెరుగు పరచడం, అటవీ హక్కుల చట్టాన్ని పూర్తి స్థాయిలో తక్షణమే అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం అభివృద్ధి ప్రశ్న మాత్రమే కాదు, గిరిజనుల హక్కులు, గౌరవం, సమానత్వం కోసం సాగుతున్న న్యాయమైన పోరాటం. పెద్దమల్లాపురం అభివృద్ధి అంటే గిరిజనుల భవిష్యత్తుకు భరోసా కల్పించడమేనని సమత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెబ్బాప్రగడ రవి ఆ మీడియా ప్రకటనలో పేర్కొన్నారు.

కమ్యూనిటీ ఆఫ్ క్రైస్ట్ ప్రేయర్ సెంటర్ నందు

# క్రిస్మస్ సంబరాలు

### నూతన వస్త్రాలు అందించి దైవజనులను సన్మానించిన అధ్యక్షులు పాస్టర్ విక్రమ్




**ప్రత్తిపాడు, విశ్వం వాయస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పత్తిపాడు కేంద్రంగా కమ్యూనిటీ ఆఫ్ క్రైస్ట్ ప్రేయర్ సెంటర్ నందు పాస్టర్ విక్రమ్ అధ్యక్షతన 2025 క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిగించారు. కమ్యూనిటీ అఫ్ క్రైస్ట్ సెంటర్ నందు మిషన్ ట్రైనింగ్ లో ఉన్న గృహిణులు శ్రద్ధ గా పాల్గొన్నారు. ప్రత్యేకమైన పాటలు వాక్యం అనంతరం క్యాండిల్స్ వెలిగించి కేక్ కటింగ్ అనంతరం పాస్టర్ విక్రమ్ వాక్యాన్ని చదివి యేసే లోక రక్షకుడని ప్రతి మానవాళిని పాపం నుండి విడిపించి పరిశుద్ధులుగా మార్చడానికి తన చివరి రక్తపు బొట్టు చిందించి మనకు పాప విమోచన ప్రసాదించాడని ప్రపంచంలో అనేక దేశాలు వారు క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకుంటారని ప్రతి ఒక్కరు సత్యాన్ని గూర్చి అన్వేషణ చేయాలని అన్నారు. టీచర్స్ పుష్ప, టీచర్ వెంకటలక్ష్మి లు క్రిస్మస్ లో పాల్గొన్న అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్మస్ ఆరాధనకు ఆహ్వానించబడిన దైవజనులు పాస్టర్ గంగరాజు, పాస్టర్ జాన్ మార్క్, దైవజనురాలు ద్వార్క ముగ్గురు హెచ్చరికల మాటలుగా క్రిస్మస్ సందేశాన్ని అందించారు అనంతరం అందరూ ప్రేమ విందు లో పాల్గొని క్రిస్మస్ ఆనందాన్ని పంచుకున్నారు

# 20న భగత్ సింగ్, చారు మజుందార్ విగ్రహాల ఆవిష్కరణ




**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరంలో సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో 20న శనివారం జరగనున్న షహీద్ భగత్ సింగ్, కామ్రేడ్ చారు మజుందార్ విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవానికి భారీ సంఖ్యలో ప్రజానీకం హాజరై విజయవంతం చేయాలని సిపిఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కొసిరెడ్డి గణేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన ఏలేశ్వరంలో మీడియాతో బుధవారం మాట్లాడారు. భారతదేశ స్వాతంత్రం కోసం ఉరి కంబాన్ని ముద్దాడిన షహీద్ భగత్ సింగ్, భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం అమరుడైన కామ్రేడ్ చారు మజుందార్ విగ్రహాల ఆవిష్కరణకు "మేలుకో ఆంధ్రప్రదేశ్" సంస్థ కో కన్వీనర్ రమేష్ పట్నాయక్, ఏపీ, ఒరిస్సా ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్షులు చందా భూషణం ముఖ్య అతిథులుగా విచ్చేయ నున్నారని కొసిరెడ్డి గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటలకు ఏలేశ్వరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి పలు రకాల గిరిజన నృత్యాలతో, భారీ ర్యాలీతో వినోద్ మిశ్రా నగర్ కి చేరుకుంటుందని, విగ్రహావిష్కరణ జరిగిన అనంతరం చారు మజుందార్ భవనంలో జరిగే మహాసభ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఏలేశ్వరం నుండి జడ్డంగి అన్నవరం వరకు ఉన్న గిరిజన రహదారి సమస్యతో పాటు పలు సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం చేపడతామని కొసిరెడ్డి గణేష్ ప్రభుత్వానికి ముందస్తు సూచన చేశారు. ఈ మీడియా సమావేశంలో మహిళా సంఘం నాయకురాలు గంటేడి నాగమణి, కందుల వరలక్ష్మి, మసిరపు రాజారావు, కందుల కృపా ప్రసాద్, పలపా సుందరి, కందుల క్రాంతి కుమార్, అనకాపల్లి సూర్య కుమారి, కందుల సునీత, ఎలమర్తి మణి, గుర్రం రాజేశ్వరి, పచ్చిమల్ల సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా "దేశం"అధ్యక్షుడిగా జ్యోతుల నవీన్ కుమార్ - హర్షం వ్యక్తం చేసిన కీర్తి వెంకట సుభాష్

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా రెండోసారి కూడా జ్యోతుల నవీన్ కుమార్ నే పార్టీ అధిష్టానం నియమించడంతో ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకట సుభాష్ మాట్లాడుతూ తండ్రికి తగ్గ తనయుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన జ్యోతుల నవీన్ రాజకీయ నేపథ్యమున్న కుటుంబం నుండి వచ్చినా సరే తన రాజకీయ ప్రస్థానాన్ని ఇర్రిపాక సర్పంచిగా ప్రారంభించి జగ్గంపేట జడ్పిటిసి సభ్యుడిగా, జిల్లా ప్రజా పరిషత్తు చైర్మన్ గా, కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పనిచేసి తెలుగుదేశం పార్టీకి కాకినాడ జిల్లాలో పూర్వ వైభవం తెచ్చిన నాయకుడు నవీన్ అని కొనియాడారు. చిన్న కార్యకర్త నుంచి మొదలుకొని నియోజకవర్గ స్థాయి నాయకుల వరకు జిల్లాలో అందర్నీ కలుపుకొని పోయే వ్యక్తిగా జ్యోతుల నవీన్ పేరు తెచ్చుకున్నారని, ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర తెలుగు దేశం పార్టీ అధిష్టానం ఆయనను రెండోసారి కూడా జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కి, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ కి, సహకరించిన జిల్లా నేతలతో పాటు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకి ఈ సందర్భంగా నియోజకవర్గం తెలుగు యువత తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని సుభాష్ అన్నారు. రెండో సారీ కూడా జిల్లా పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయదంకా మోగించాలని ప్రత్తిపాడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్ ఆశాభావం వ్యక్తం చేసారు.





## రెయిన్‌బో హాస్పిటల్‌లో

# తల్లి బిడ్డల సంరక్షణకు కృషి

**రెయిన్‌బో లో వైద్యం తల్లిదండ్రులకు ధైర్యం - రెయిన్ బో హాస్పిటల్ ప్రారంభవానికి విచ్చేసిన నారా బ్రాహ్మణి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రెయిన్బో హాస్పిటల్ వైద్యంతో తల్లిదండ్రులకు ధైర్యం ఉంటారు, మంచి చికిత్సలు అందిస్తారని నారా బ్రాహ్మణి పేర్కొన్నారు. బుధవారం రాజమండ్రిలో రెయిన్ బో హాస్పిటల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా నారాబ్రాహ్మణి మాట్లాడుతూ రాజమండ్రికి రావడం నాకు చాలా ఆనందంగా ఉందన్నారు. నా మనసుకు నచ్చిన ఊరు రాజమండ్రి అన్నారు. మా తాతయ్య ఇదే ఊర్లో ఉండేవారని, నా చిన్నప్పుడు ఎక్కువ సమయం ఇక్కడే గడిపానని అన్నారు. రాజమండ్రి నగరం నా మనసుకు ఎంత దగ్గరో రెయిన్బో హాస్పిటల్ కూడా నా మనసుకి అంతే దగ్గర అన్నారు. రెయిన్బో హాస్పిటల్ సిబ్బంది నా కుటుంబ సభ్యుల లాంటివారని అన్నారు. ఎందుకంటే నాకు రెయిన్బోకు ఉన్న సంబంధం అటువంటిదన్నారు. డాక్టర్ రమేష్, దినేష్ తీసుకునే కేర్ చాలా అద్భుతంగా ఉంటుందని వివరించారు. పేషెంట్‌ని సొంత మనుషుల్లా చూసుకుంటారని తెలిపారు. బెస్ట్ క్వాలిటీ మెడిసిన్, బెస్ట్ కేర్ తీసుకోవడంలో రెయిన్బో కు ప్రత్యేకత ఉందన్నారు. రమేష్ వారి టీమ్ ను అభినందించారు. ఈ హాస్పిటల్లో చేసే సిబ్బంది ఎక్స్పిరియన్స్ ఉన్నవాళ్లు వేల్ ట్రైన్డ్ సిబ్బంది ఉంటారు అన్నారు. ఎంతోమంది తల్లిదండ్రులకు మేమున్నామని ధైర్యం ఈ రెయిన్బో హాస్పిటల్ ఇస్తుందనీ అన్నారు. రెయిన్ బో చిల్డ్రన్ హాస్పిటల్ వ్యవస్థాపకులు చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ రమేష్ కంచర్ల మాట్లాడుతూ రెయిన్ హాస్పిటల్ ప్రస్తుతం 9 నగరాలలో 22 హాస్పిటల్స్ కలిగి తల్లి బిడ్డల సంరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 2,285 పడకల సామర్థ్యత కలిగి, 26 సంవత్సరాలుగా నిరంతర సేవలు అందిస్తున్నామని చెప్పారు. చిన్న పిల్లల కు వైద్యం అందరికి అందుబాటులో ఉండాలని లక్ష్యంతో పిల్లలకు సమీపంలోనే మంచి నాణ్యమైన వైద్య సేవాలు అందించేందుకు రెయిన్బో హాస్పిటల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బర్త్ బై రెయిన్ బో



తల్లి సంరక్షణలో నిమగ్నమై సాధారణ, సంక్లిష్టమైన ప్రసవాలను ఆధునిక ప్రక్రియ ద్వారా చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. గైనకాలాజీ సంబంధిత, పెటాల్ మెడిసిన్ పెరినాటల్, సంతానోత్పత్తి సమస్యలకు విశ్వసనీయమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. రెయిన్ బో చిల్డ్రన్ హాస్పిటల్ బర్త్ రైట్ బై రెయిన్బో హాస్పిటల్స్ క్లినికల్ డైరెక్టర్, గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రణతి రెడ్డి రెయిన్బో గ్రూప్స్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ దినేష్ కుమార్ చిర్ల మాట్లాడుతూ రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్ పిల్లల, నియో నాటల్, పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్, పీడియాట్రిక్ మల్టీ-స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్నాయి. ఇవి అత్యంత క్లిష్టమైన అవయవ మార్పిడి సేవలను కూడ అందిస్తున్నామని తెలిపారు.

# ఇంధన పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా తూర్పుగోదావరి సర్కిల్ పరిధిలోని రాజమహేంద్రవరం టౌన్‌లో ఇంధన పొదుపుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల, ఎస్.కె.వి.టి ప్రభుత్వ పాఠశాలలలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, ఉపన్యాస పోటీలు



నిర్వహించగా సుమారు 300 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతల వివరాలను ఈ నెల 20న ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. విజేతలకు బహుమతులను గోదావరి గట్టున ఉన్న ఏపీ ఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ కార్యాలయంలో ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వి.ఏం. సుబ్రహ్మణ్యం, టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నక్కపల్లి శామ్యూల్ ఆధ్వర్యంలో ఏఈలు, జెఈలు పాల్గొన్నారు.

# డ్యూటీ డాక్టర్ నిర్లక్ష్యంతో బాలింత మృతి

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బుధవారం ఉదయం స్థానిక వి.ఎల్ పురం మార్గాన్ని ఎస్టేట్ నందు నగర వైయస్సార్సీపి కార్యాలయంలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక బాలింత సరి అయిన వైద్య పరీక్షలు అందక ప్రాణాలు విడిచిన సంగతి తెలిసిందే దీని మీద ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇచ్చిన నివేదిక వివరాలు ప్రసూతి సమయంలో డ్యూటీ డాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఆమె ప్రాణాలు పోయేంత పరిస్థితి ఏర్పడితే, ప్రసవం అనంతరం మరొక డాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఆమె ప్రాణాలే పోయాయి అసలు ప్రభుత్వం ఉన్నది ప్రజల ప్రాణాలు కాపాడానికా లేక తీయడానికా.. విచిత్రం ఏంటంటే ఇప్పుడు ఇదే ప్రెస్ మీట్ సమయంలో రాజమండ్రి నగరంలో ఒక ప్రైవేటు ఆసుపత్రి ప్రారంభోత్సవానికి విచ్చేసిన సాక్షాత్తు ముఖ్యమంత్రి కోడలు అంటే ప్రైవేట్ ఆసుపత్రి మీద ఉన్న మక్కువ ప్రభుత్వ ఆసుపత్రుల మీద ఈ ప్రభుత్వానికి లేదు పేద ప్రజల ప్రాణాలు పోయినా కూడా పెద్దలు జేబుల్లోకి డబ్బులు వెళ్లడమే వీళ్ళ ప్రధాన లక్ష్యంగా కనపడుతుంది. తల్లిని కోల్పోయి అనాధ అయిన ఈ పసికందుకు నష్టపరిహారం కింద కోటి రూపాయలు ఈ పాప పేరు మీద ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి తక్షణమే చెల్లించాలని

**ఈ సంఘటనకు కారకులైన వారిని శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి బాలింత ప్రాణాలు తీసి పసికందుని అనాథను చేసిన ప్రభుత్వ నిర్లక్ష్యం... పేకాట క్లబ్బులు నిర్వహించే వ్యక్తికి చైర్మన్ పదవి కట్టబెట్టిన ఎమ్మెల్యే మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ విమర్శ**



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. దొంగలు పడ్డ ఆరు నెలలకి కుక్కలు మొరిగాయంట అన్న చందాన మొరంపూడి ఫ్లై ఓవర్ కు లైట్లను మంజూరు అయ్యింది అని ప్రకటన వచ్చిన వెంటనే ప్రజా ప్రతినిధుల సోషల్ మీడియా రీల్స్ పోస్టులు ఒకటేంటి రకరకాల విచిత్రాలు గత రాత్రి నుంచి చూస్తూనే ఉన్నాం ఏమైనా ఫ్లైఓవర్ మొదలు అయి రెండు సంవత్సరాలు పూర్తికా వస్తున్న సందర్భంగా లైట్లు శాంక్షన్ చేయించిన జిల్లాలో ఐదుగురు ప్రజా ప్రతినిధులకు వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ధన్యవాదాలు తెలుపుతుంది. మోరంపూడి ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్లు ప్యాచ్లు వేయిస్తున్నానని స్థానిక ఎమ్మెల్యే ఒక ప్రకటనలో చెప్పారు అంతేకాదు రాజమండ్రి నగరంలో సుమారుగా 2800 ప్యాచ్ లు ఉన్నాయని చెప్పడం జరిగింది. రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే నా లేక రోడ్డు ప్యాచ్ ఎమ్మెల్యే నో అర్థం అవ్వలేదు. వినడానికే చాలా విడ్డూరంగా ఉంది. మన స్థానిక ఎమ్మెల్యే నిన్న గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ రివ్యూ కి వెళ్లడం జరిగింది అక్కడ ఆయన మాట్లాడుతూ పిపిపి మోడ్ ద్వారా వీటిని నిర్మాణం జరుగుతుందని ఇదే పద్ధతిలో మన దేశంలో వడోదర అనే రాష్ట్రంలో జరిగిందని ఈయన వెల్లడించారు కొంత విషయపరిజ్ఞానం అంటూ ఉండాలి అది లేదు మన ఎమ్మెల్యే గారికి. ఎందుకంటే వడోదర అన్నది స్టేట్ కాదు ఒక సిటీ అది కూడా తెలియదు పాపం ఈయనకి మన నగరం చేసుకున్న కర్మ ఇది. ఇటీవల కాలంలో ఒక చిన్న గొడవ రాద్ధాంతం చేసి అది మా పార్టీ వల్లే జరిగింది అని చెప్పుకోవడం సిగ్గుచేటు అసలు వివరాలు ఏమిటంటే ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ రికవరీ కోసం ఒక ఇంటికి వెళ్లిన ఏజెంట్ ను అక్కడ వాళ్ళు కొట్టడం జరిగింది ఇంట్లో కొట్టడమే కాకుండా బయటకు తీసుకువచ్చి కూడా కొట్టడం జరిగిందని వివరాల్లోకి వెళితే తెలిసింది తదనంతరం వీరు ఈ రికవరీ ఏజెంట్ తాలూకా మనుషులు వెళ్లి తిరిగి వాళ్ళ మళ్ళీ తిరిగి కొట్టడం జరిగింది. ఏది ఏమైనా ఈ సంస్కృతిని ఎప్పుడూ కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్షమించదు కానీ నగరంలో ఉన్న ఎమ్మెల్యే దీనిని వక్రీకరించి నా మీద రుద్దాలన్న దుర్బుద్ధితో నా వెంట ఉండే సుభాని అనే వ్యక్తి మీద ఎఫ్ఐఆర్ లో పేరు లేకపోయినా మరల ఎఫ్ఐఆర్ లో అతని పేరు రాయించి రిమాండ్ కి పంపించే ప్రయత్నం చేశారు. ఈ సుభాని అన్న వ్యక్తి మీద అతను నా కూడా ఉంటాడన్న ఒకే ఒక్క కక్షతో ఈ కేసులో ఇరికించడానికి ప్రయత్నాలు జరిగాయని తెలుస్తోంది. తదనంతరం పలువురు మహిళలతో ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించడం అందులో ప్రత్యక్షంగా అక్కడ ఉన్న ఒక మహిళ ఏడవండి గట్టిగా ఏడవండి అనడం తెలుగుదేశం పార్టీ యొక్క నీచ సంస్కృతిని బయటపెడుతుంది. దొండపాటి సత్యం బాబు గారు ప్రెస్ మీట్ మార్వాడీలు గో బ్యాక్ అంటూ దొంగ సామాన్లు అమ్మేవాళ్ళు అంటూ ఇదివరకు చాలా రకాల విన్యాసాలు చేసిన వ్యక్తి , అప్పుడు మా ప్రభుత్వంలో అతని అల్లుడుగారు బలవన్మరణం చెందితే ఎంక్వయిరీలు చేసి ఉంటే అది ఇంకో రకంగా ఉండును ఎందుకంటే దీని మీద ఇంత కన్నా ఎక్కువ మాట్లాడడం అనవసరం. రాజమండ్రి నగరానికి ఎంతో ప్రసిద్ధి ఖ్యాతి తెచ్చిన కోటిలింగాల దేవస్థానం ఒకటి. దీనిని దక్షిణ కాశి అని కూడా అంటారు. అటువంటి పుణ్యక్షేత్రమైన ఈ దేవస్థానానికి పేకాట క్లబ్బు నిర్వహించే ఒక మాజీ కార్పొరేటర్ అయిన వ్యక్తిని చైర్మన్ గా నియమించడంలో ఆంతర్యం ఏమిటి ఈ నియామకం పవిత్రమైన హిందూ సాంప్రదాయాన్ని ఇటువంటి నియామకంతో మంటకలిపైన వ్యక్తి ఈ ఎమ్మెల్యే అని విమర్శించారు. ఈ సమావేశంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సీఎంతో కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కీర్తి చేకూరి

**రెండు రోజుల పాటు జరగనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** సచివాలయం 5వ బ్లాక్‌లో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన 5వ జిల్లా కలెక్టర్ల సదస్సు తొలి రోజు సమావేశంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పాల్గొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాల్లో సాధించిన ప్రగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. జీఎస్డీపీ వృద్ధి లక్ష్యాల సాధనకు జిల్లా స్థాయిలో పక్కా ప్రణాళికలు రూపొందించాలని, డిమాండ్ డ్రివెన్ వ్యవసాయం, మార్కెటింగ్ ఇంటెలిజెన్స్, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం ఆదేశించారు. నీటి భద్రత, ఉద్యోగాల కల్పన, పర్యాటకం, ఉద్యాన రంగంలో పెట్టుబడుల ఆకర్షణ, ప్రజా సేవల వేగవంతమైన అమలు ద్వారా ప్రజల్లో విశ్వాసం మరింత పెంచాలని సూచించారు. కలెక్టర్లు ప్రభుత్వానికి అంబాసిడర్లుగా పనిచేసి, పాలనలో స్పీడ్ మరియు నాణ్యతను పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సీఎస్ విజయానంద్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, మంత్రులు, జిల్లా కలెక్టర్లు, కార్యదర్శులు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

# సలాదికి ఘనంగా నివాళులర్పించిన జక్కంపూడి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** వైయస్సార్ సిపి నాయకులు సలాది సత్యనారాయణ మాతృమూర్తి సలాది సత్యవతి ఇటీవల స్వర్గస్తులైనారు. బుధవారం వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా, సలాది సత్యనారాయణను పరామర్శించారు. అనంతరం స్వర్గీయ సలాది సత్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు సలాది వెంకటేశ్వరరావు, కాలచర్ల శివాజీ, బొరుసు బద్రి, నీరుకొండ బాబ్జి, ఐల శ్రీను, శ్రీరంగం శ్రీను, భాను, కోడినాగుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రాజానగరంలో పలు కుటుంబాలకు బత్తుల పరామర్శ

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం మండలం రాజానగరం జనసేన పార్టీ నాయకుల కుటుంబసభ్యులు తంబాబత్తుల అప్పారావు ఇటీవల స్వర్గస్తులైనారు. బుధవారం జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి జనసేన పార్టీ నాయకులు తంబాబత్తుల ఉదయ్‌ని పరామర్శించి, స్వర్గీయ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రగాఢ సంతాపం తెలియజేశారు. అనంతరం నరవ కృష్ణ సతీమణి అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసి, పరామర్శించి ఆరోగ్యంపై ఆరా తీసి ధైర్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అద్దాల శ్రీను, యర్రంశెట్టి పోలారావు, తన్నీరు తాతాజీ, మోదీ సత్తిబాబు, పలువురు జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.



# పవన్ అభిమానుల మంట

**సెల్ఫీల్లో ఎవరు ముందూ? - ఫోటో ఫ్రేమ్‌లో గందరగోళం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పవన్ కళ్యాణ్ అభిమానులమంటూ చెప్పుకునే వారికి ఇటీవలి రాజకీయ పరిణామాలతో ఓ పెద్ద సందేహం ఎదురవుతోంది. "మనం పవన్ కళ్యాణ్ అభిమానులం" అని గుండె మీద చేయి వేసుకుని చెప్పుకునే వారు, అదే సమయంలో పవన్, చంద్రబాబు, అనితమ్మల అభిమానులమని కూడా ప్రకటిస్తూ అయోమయానికి లోనవుతున్నారు. సాధారణంగా అభిమానులు తమ అభిమాన హీరో లేదా నాయకుడితో ఫోటో దిగాలని ఆశపడతారు. కానీ ఇక్కడే అసలు ట్విస్ట్. పవన్ కళ్యాణ్‌తో ఫోటో దిగాలనుకునే అభిమానులకు అవకాశం దొరకకముందే, పవన్ మాత్రం చంద్రబాబు, అనితమ్మలతో సెల్ఫీ దిగడంలో బిజీగా కనిపిస్తున్నారు. దీంతో "ఇక మనం ఎవరితో ఫోటో దిగాలి?" అంటూ అభిమాన వర్గాల్లో ముచ్చట కాదు.. మంట మొదలైంది. "పవన్ అభిమానులమని చెప్పుకుంటే పవన్‌తో ఫోటో ఉండాలా? లేక పవన్ ఇష్టపడే వారితో దిగితే సరిపోతుందా?" అనే ప్రశ్న సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. కొందరు "పవన్ ఫోటో ఫ్రేమ్‌లో ఉంటే చాలు" అంటుంటే, మరికొందరు "పవన్ చూసిన చోటే మన ఫోటో దిగాలి" అంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు. మొత్తానికి పవన్ అభిమానుల ఫోటో ఆశలు ఇప్పుడు సెల్ఫీ రాజకీయంలో చిక్కుకుని, 'మామా.. ఇక మనం ఎవరితో ఫోటో దిగాలి?' అనే ప్రశ్నతోనే మిగిలిపోయాయి.

## నకారా పెన్షనర్ల చేసిన

# సేవలు అభినందనీయం



**ధవళేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పెన్షనర్ల ఆరాధ్యదైవం ధరమ్ స్వరూప్ నకారా పెన్షనర్లకు చేసిన విశిష్ట సేవలను పరిగణన లోనికి తీసుకొని ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిగాయి. అధ్యక్షులు యర్రమోతు ధర్మరాజు మాట్లాడుతూ ప్రభుత్వరంగ, ప్రభుత్వేతర సంస్థల్లో పనిచేయు సిబ్బంది పదవీ విరమణ అనంతరం భరోసా గా ఈరోజు ఆనందంగా జీవిస్తున్నామంటే అనాడు నకారా చూపిన మార్గమేనని కొనియాడారు, ప్రధాన కార్యదర్శి దువ్వూరి కామేశ్వరశర్మ, కోశాధికారి ఉరింకల సత్యనారాయణ, ప్రొఫెసర్ ఐ.వి. సుబ్బారావు, కాట్రగడ్డ వెంకటేశ్వర్లు, వి. సాంబశివ రావు, డిఏజెబి ప్రసాద రావు, నకారా చేసిన సేవలు వివరించారు. అనంతరం డాక్టర్ విన్నకోట పవన్ కుమార్ చే ఆయుర్వేద వైద్యశిభిరం నిర్వహించగా అరవై మంది వైద్య సేవలు వినియోగించుకున్నారు, ఈ కార్యక్రమంలో సభ్యులు తోరం కేశవరావు, కొండా సూర్యనారాయణ, సమర్తకుర్తి సుబ్బారావు, అంజూరి సూర్యారావు, కొంజెర్ల వెంకటరత్నం, శ్రీరాములు, వెంపరాల వెంకటేశ్వర్లు, అరవ సత్యనారాయణ, సమర్తకుర్తి రాంబాబు, బుగ్గా సుబ్రహ్మణ్యం, రంగారావు, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు, డాక్టర్ పవన్ కుమార్‌కు ధర్మరాజు పెన్షనర్లు దుశ్శాలువా పండ్లుతో సత్కారం చేశారు.

## సమాజానికి ఆదర్శంగా నిలిచిన

# అంగన్‌వాడీ ప్రత్తిపాటి వెంకటలక్ష్మి

**- కొయ్య అప్పారావు, మరియమ్మ జ్ఞాపకార్థంగా సిమెంట్ బల్లలు ఏర్పాటు**



**కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజానికి ఎంతో ఆదర్శంగా నిలుస్తున్న చిడిపి గ్రామం అంగన్వాడీ ఆయా కుటుంబం కొవ్వూరు మండలం లోని చిడిపి గ్రామానికి చెందిన ప్రత్తిపాటి వెంకటలక్ష్మి అంగన్వాడీ ఆయగా పని చేస్తూ తనకు వచ్చిన జీతం లో నుండి కొంత తన తల్లిదండ్రులు స్వర్గీయ కొయ్య అప్పారావు, మరియమ్మ జ్ఞాపకార్థంగా పలు సేవ కార్యక్రమాల్లో భాగంగా 3వేల రూపాయలుతో చిడిపి గ్రామం అంగన్వాడీ కేంద్రానికి బాత్ రూమ్ డోర్, గడియారం, గ్రామ ప్రజలు ప్రయాణకుల సౌకర్యార్థం ఆర్థిక సహాయంతో సిమెంట్ బల్లలు, ఏర్పాటు చెయ్యడం జరిగింది. సమాజానికి ఏమి చేసాం అనే మంచి సంకల్పంతో కుటుంబ సమేతంగా సమాజానికి ఆదర్శంగా చిడిపి గ్రామంలోని అంగన్వాడీ ఆయా ప్రత్తిపాటి వెంకటలక్ష్మి కుటుంబం నిలుస్తుంది అని అంగన్వాడీ సూపర్వైజర్ యాడంగి భాగ్యకుమారి, ప్రత్తిపాటి వెంకటలక్ష్మికి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి వెంకటలక్ష్మి, ఆశా కార్యకర్త కొయ్య దమయంతి , అంగన్వాడీ టీచర్ అక్కాబత్తుల నానెమ్మ, దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ప్రత్తిపాటి నాగరాజు పాల్గొన్నారు.

# ఘనంగా విశ్రాంతి ఉద్యోగుల దినోత్సవం

**పలువురుకి దుస్తుల పంపిణీ - చిరు సత్కారం**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండలో అఖిల భారత విశ్రాంతి ఉద్యోగుల దినోత్సవాన్ని జిల్లా పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు మూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం కోరుకొండ విశ్రాంతి ఉద్యోగుల భవనం వద్ద, నూతన విశ్రాంతి ఉద్యోగుల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు గొల్లపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కే నాగేశ్వరరావు, సెక్రెటరీ సింగారపు వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎస్ఎల్ఎం హెూమర్, సహాయ కార్యదర్శి వేమూరి కృష్ణారావు, కోశాధికారి నారెం లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ డిఎస్ నకర చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. 75 సంవత్సరాల నుండిన ఉద్యోగులను సంఘం తరఫున ఘనంగా సత్కరించారు. అనంతరం పలువురు మహిళలకు చీరలు, పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షులు మూర్తి, సబ్ ట్రెజరీ అధికారి విజయసారథిలను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కే రవికుమార్, పి నాగేశ్వర రావు, కే వెంకట్రాజు, ఎం నరసింహమూర్తి, వి/భూపతి, జీవిఎస్ రవీంద్ర, పుణ్యమూర్తుల కృష్ణమూర్తి, కొంచ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 2026-2027 ఆర్థిక సంవత్సరానికి 22.46 కోట్లతో

# అంచనా బడ్జెట్ ఆమోదం : అశోక్ కుమార్

**18.50 కోట్లు ఎన్ఆర్ఈజీఎస్ అంచనా, వ్యయం**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** 2026-2027 ఆర్థిక సంవత్సరానికి వివిధ పద్దుల కింద 22.46 కోట్లతో అంచనా బడ్జెట్ సర్వసభ్య సమావేశంలో ఆమోదించినట్లు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బత్తిన అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు వుల్లి సూర్యకుమారి బుజ్జిబాబు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2026- 27 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్ 22.46 కోట్లుగా సమావేశం ఆమోదించిందన్నారు. అదేవిధంగా 22,46,05,570 రూపాయలతో అంచనా వ్యయం పద్దులు పోను, 43,430 రూపాయలు మిగిలి బడ్జెట్ అంచనా వ్యయంగా చూపమన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2026-27 ఆర్థిక సంవత్సరానికి 18.50 కోట్ల ఆదాయం, అదే మొత్తం వ్యయంగా చూపడం అయిందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు 2026-27 ఆర్థిక సంవత్సరానికి 82 లక్షల రూపాయలు ఆదాయ వ్యయంగా వివిధ పద్దులు కింద ఖర్చు చూపించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు బొరుసు నాగమణి, డిప్యూటీ తాసిల్దార్ సాయిరాం, ఈవోపీఆర్డి ప్రతాప్, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు

# వై.ఎస్ షర్మిళాతోనే కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

**కో-ఆర్డినేటర్ మేడవరపు భద్రందొర**



**నిడదవోలు ,విశ్వం వాయిస్ న్యూస్ :** నిడదవోలు నియోజకవర్గం కోఆర్డినేటర్ మేడవరపు భద్రం దొర వారి ఆధ్వర్యం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై.యస్ షర్మిలరెడ్డి పుట్టినరోజు సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు నాయకులు కార్యకర్తలు మధ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోఆర్డినేటర్ మేడవరపు భద్రందొర మాట్లాడుతూ షర్మిలారెడ్డి వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ త్వరలోనే పూర్వ వైభవం చూస్తామని అన్నారు. నిన్న పార్లమెంట్లో మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఈ పథకంలోని మహాత్మా గాంధీ వారి పేర్లు తొలగించి ఆపథకానికి మరొక పేరుని సృష్టించి బిల్లు పెట్టారు. ఇది మహాత్మా గాంధీని అవమానించడమే అని, దేశ నిర్మాణంలో గాని, దేశ అభివృద్ధిలో గాని, ఏమాత్రం పాత్రలేని ఆర్ఎస్ఎస్ భావజాలంతో కలిగిన ఈ బిజెపి ప్రభుత్వం స్వాతంత్రం సాధించిన మహానుభావులను దేశానికి ఎంతో అభివృద్ధి చేసిన ప్రధాన మంత్రులను టార్గెట్ చేసి వారి యొక్క నిరంకు సత్వ వైఖరిని బయటపెట్టి దేశాన్ని నాశనం చేయడానికి పూనుకున్నారని అన్నారు. అంతేకాకుండా ఆనాడు గాడ్సే మహాత్మా గాంధీని భౌతికంగా హత్య చేస్తే నేడు ఈ బిజెపి ప్రభుత్వం స్వాతంత్ర ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన మహానుభావుడు గాంధీ యొక్క ఆశయాలను ఆలోచనలను నైతికంగా హత్య చేస్తున్నారు. ఈ బీజేపీ ప్రభుత్వం ఎన్నో వేలమంది కుటుంబాలు ఉపాధి హామీ పథకం వల్ల ఉపాధి పొందుతున్నారు, మన రాష్ట్రానికి సుమారు గా 20 వేల కోట్లు రూపాయల నుంచి 30 వేల కోట్లు రూపాయలు నష్టం వస్తుందని అటువంటి పథకాన్ని నిర్వీర్యం చేయాలని బిజెపి ప్రభుత్వం కుటిల ప్రయత్నం చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నం మురళీకృష్ణ, బండి అభిషత్తుడు, కాకి కిషోర్, భాస్కర్, కళ్లెం ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



## చేతులు జోడించి వేడుకుంటున్నా.. ఎఐ నాన్సెన్స్‌ను ఎంకరేజ్ చేయకండి : శ్రీలీల

టెక్నాలజీ అనేది డైలీ లైఫ్‌ను ఇంకా ఈజీ చేయడానికే కానీ మనశ్శాంతిని దూరం చేసి జీవితాలను మరింత సంక్లిష్టం చేయడానికి కాదంటూ శ్రీలీల పోస్ట్ చేసారు. ఈ మధ్య సోషల్ మీడియాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పేరుతో జరుగుతున్న ప్రచారం, సృష్టిస్తున్న అసభ్యకరమైన చిత్రాలు ఆందోళన కలిగిస్తున్నాయి. టెక్నాలజీ అనేది డైలీ లైఫ్‌ను ఇంకా ఈజీ చేయడానికే కానీ మనశ్శాంతిని దూరం చేసి జీవితాలను మరింత సంక్లిష్టం చేయడానికి కాదంటూ శ్రీలీల పోస్ట్ చేసారు. ఈ మధ్య సోషల్ మీడియాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పేరుతో జరుగుతున్న ప్రచారం, సృష్టిస్తున్న అసభ్యకరమైన చిత్రాలు ఆందోళన కలిగిస్తున్నాయి. వాటిపై చాలా మంది హీరోయిన్లు ఇప్పటికే తమ గళం విప్పారు. తాజాగా నటి శ్రీలీల సైతం దీనిపై రియాక్ట్ అయ్యారు. చేతులు జోడించి ప్రతి సోషల్ మీడియా యూజర్స్‌ని వేడుకుంటున్నాను.. దయచేసి ఇలాంటి %ూ×% జనరేటెడ్ నాన్సెన్స్‌ను ఎంకరేజ్ చేయకండి.. టెక్నాలజీని వాడుకోవడానికి, దానిని దుర్వినియోగం చేయడానికి మధ్య చాలా పెద్ద వ్యత్యాసం ఉంది.. దాన్ని మనం గుర్తించాలంటూ ఆమె కోరుకున్నారు. సినీ పరిశ్రమలో ఉన్న ప్రతి అమ్మాయి.. ఆమె ఒక ఆర్టిస్ట్ అయినప్పటికీ, ఆమె ఎవరికో ఒకరికి కూతురు, మనవరాలు, సోదరి లేదా స్నేహితురాలు అయి ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని శ్రీలీల పేర్కొన్నారు. కళను వృత్తిగా ఎంచుకుని.. పదిమందికి వినోదాన్ని, ఆనందాన్ని పంచే ఈ ఇండస్ట్రీలో.. మేము కూడా సురక్షితంగా ఉన్నామనే భరోసా మాకు కావాలి.. ఒక ప్రొటెక్టెడ్ ఎన్విరాన్‌మెంట్‌లో పనిచేస్తున్నామనే నమ్మకం మాకు కలగాలి. అంతేకానీ టెక్నాలజీ మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఆయుధంగా మారకూడదంటూ ఎమోషనల్ నోట్ విడుదల చేసారు శ్రీలీల. తనుకున్న బిజీ షెడ్యూల్స్, షూటింగ్స్ వల్ల ఆన్‌లైన్‌లో జరుగుతున్న చాలా విషయాలు తన దృష్టికి రాలేదని.. తన శ్రేయోభిలాషులు, మిత్రులు ఈ విషయాన్ని నా దృష్టికి తెచ్చినప్పుడు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యానన్నారు శ్రీలీల.

## సినిమాలు తక్కువే కానీ క్రేజ్ మాత్రం ఫుల్..

### మరీ అంత క్యూట్ గా ఉంది ఏంది మావ..!!

హీరోయిన్స్ తమ అందాలతో ప్రేక్షకులను కవ్విస్తూ ఉంటారు. రోజు రోజుకు అందాన్ని మరింత పెంచుకుంటూ అభిమానులను ఆకట్టుకుంటూ ఉంటారు. అయితే కొంతమంది హీరోయిన్స్ చిన్ననాటి ఫోటోలు చూస్తే షాక్ అవ్వాల్సిందే. అప్పటికి ఇప్పటికీ ఇంత మార్పా అని నోరెళ్లబెట్టాల్సిందే.. చిన్నప్పుడు యావరేజ్ గా ఉన్న భామలు చాలా మంది ఇప్పుడు ఎక్స్ ట్రా ఆర్డనరీ బ్యూటీస్ గా మారిపోయారు. హీరోయిన్స్ తమ అందాలతో ప్రేక్షకులను కవ్విస్తూ ఉంటారు. రోజు రోజుకు అందాన్ని మరింత పెంచుకుంటూ అభిమానులను ఆకట్టుకుంటూ ఉంటారు. అయితే కొంతమంది హీరోయిన్స్ చిన్ననాటి ఫోటోలు చూస్తే షాక్ అవ్వాల్సిందే. అప్పటికి ఇప్పటికీ ఇంత మార్పా అని నోరెళ్లబెట్టాల్సిందే.. చిన్నప్పుడు యావరేజ్ గా ఉన్న భామలు చాలా మంది ఇప్పుడు ఎక్స్ ట్రా ఆర్డనరీ బ్యూటీస్ గా మారిపోయారు. అలాగే పైన కనిపిస్తున్న హీరోయిన్ కూడా.. పై ఫోటోలో ఉన్న బ్యూటీని గుర్తుపట్టారా.? ఆమె ఎవరో తెలిస్తే దిమ్మతిరిగిపోతుంది. ఇప్పుడు ఆమె అందానికి కుర్రాళ్ళు ఫిదా అవుతున్నారు. క్యూట్ నెస్ కు కేరాఫ్ అడ్రస్ ఆమె.. అందం మాత్రమే కాదు అదిరిపోయే అభినయం ఈవయ్యారిది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? పై ఫోటోలో ఉన్న ముద్దుగుమ్మ మరెవరో కాదు సోషల్ మీడియాతో విపరీతమైన క్రేజ్ తెచ్చుకున్న బ్రిగిడా సాగ. ఈ ముద్దుగుమ్మ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఈ అమ్మడు టెలివిజన్ నుంచి ఇండస్ట్రీలోకి వచ్చింది. విశాల్ హీరోగా నటించిన అయోగ్య సినిమాతో ఇండస్ట్రీలోకి వచ్చింది. ఇరవిన్ నిజాల్ అనే సినిమాలో నటించింది బ్రిగిడా సాగ. ఈ సినిమాలో నగ్నంగా నటించి షాక్ ఇచ్చింది. ఇందులో చిలకమ్మ అనే పాత్ర పోషించింది.బ్యూటీ చాలా ఫెవరెట్ హీరోయిన్.. కుర్రాళ్ళ డ్రీమ్ గర్ల్.. అందం కంటే ఆమె చాలా చూడముచ్చటగా ఉంటుంది. మొఖంలో భలే కళ ఉంటుంది. ఈ అమ్మడు సిందూరం అనే సినిమాతో తెలుగులోకి అడుగుపెట్టింది. ఈ సినిమా పర్లేదు అనిపించుకుంది. ఇక ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఈ బ్యూటీ షేర్ చేసే ఫోటోలు అభిమానులు ఆకట్టుకుంటున్నాయి.



**సినీ వాయిస్ CINEMA**

### అల్లు అర్జున్ రిజెక్ట్ చేసిన కథతో

## సినిమా చేసిన ఆ టాలీవుడ్ హీరో..

### కట్ చేస్తే బ్లాక్ బస్టర్ హిట్



పుష్ప 2 సినిమాతో పాన్ వరల్డ్ హీరోగా మారిపోయాడు టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్. ప్రస్తుతం ఈ హీరోకు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. ఇక పుష్ప 2 తర్వాత అట్లీ కుమార్ దర్శకత్వంలో ఓ ప్రిస్టేజియస్ మూవీ చేస్తున్నాడు అల్లు అర్జున్.చాలా మంది హీరోల్లాగే అల్లు అర్జున్ కూడా కొన్ని సినిమాలను రిజెక్ట్ చేశాడు. డేట్స్ అడ్జెస్ట్ అవ్వకపోవడమో, స్టోరీ సూట్ కాకపోవడమో, కథ నచ్చకపోవడమో.. ఇలా వివిధ కారణాలతో బన్నీ వదిలేసిన సినిమాలు చాలా నే ఉన్నాయి. అందులో కొన్ని బ్లాక్ బస్టర్స్ అవ్వగా కొన్ని బాక్స్ ఆఫీస్ దగ్గర బోల్తా పడి అల్లు అర్జున్ జడ్జ్ మెంట్ కరెక్ట్ అని నిరూపించాయి. అలా అల్లు అర్జున్ రిజెక్ట్ చేసిన ఒక సినిమాతో ఒక క్రేజీ హీరో సూపర్ సక్సెస్ ని సాధించాడు. వివరాల్లోకి వెళితే.. విక్రమ్ కే కుమార్ కు ట్యాలెంటెడ్ డైరెక్టర్ గా పేరుంది. 13 బి, 24, మనం వంటి ఎన్నో సూపర్ హిట్ సినిమాలను తెరకెక్కించారు విక్రమ్ కే కుమార్. అలాగే యూత్ స్టార్ నితిన్ కు 'ఇష్క్' రూపంలో బ్లాక్ బస్టర్ కూడా ఇచ్చారు. అయితే ఈ సినిమాకు హీరోగా నితిన్ ఫస్ట్ ఛాయిస్ కాదట. విక్రమ్ కే కుమార్ అల్లు అర్జున్ తో ఈ సినిమా చేద్దామనకున్నాడట. బన్నీకి కథ కూడా చెప్పాడట. అయితే అప్పటికే అల్లు అర్జున్ చేతిలో పలు సినిమాలు ఉండడంతో ఇష్క్ సినిమాపై పెద్దగా ఆసక్తి చూపించలేదట. దీంతో ఆ మూవీ ని నితిన్ తో చేసి సూపర్ సక్సెస్ కొట్టారు విక్రమ్ కే కేమార్.. ఈ సినిమాతోనే 13 ఫ్లాప్ సినిమాలకు చెక్ పెడుతూ సూపర్ సక్సెస్ అందుకున్నాడు హీరో నితిన్. కేవలం ఇష్క్ ఒక్కటే కాదు వివిధ కారణాలతో అల్లు అర్జున్ రిజెక్ట్ చేసిన సినిమాల్లో కొన్ని సూపర్ హిట్ మూవీస్ కూడా ఉన్నాయి. జయం, భద్ర, బొమ్మరిల్లు, 100 % లవ్, అర్జున్ రెడ్డి, పండగ చేస్కో, నాని గ్యాంగ్ లీడర్ సినిమాలు కూడా మొదట అల్లు అర్జున్ దగ్గరకే వచ్చాయట. అయితే వివిధ కారణాలతో బన్నీ వాటిని వద్దనుకున్నాడట. ప్రస్తుతం అట్లీ కుమార్ దర్శకత్వంలో ఓ పాన్ వరల్డ్ మూవీ చేస్తున్నాడు అల్లు అర్జున్. ఈ పాన్ వరల్డ్ మూవీలో బాలీవుడ్ అందాల తార దీపికా పదుకొణె హీరోయిన్ గా నటిస్తోంది. సుమారు 800 కోట్ల భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను నిర్మిస్తోంది సన్ పిక్చర్స్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. గార్డియన్ ఆఫ్ ది గెలాక్సీ తరహాలో హాలీవుడ్ లెవెల్ లో ఈ మూవీ తెరకెక్కనుందని సమాచారం.

**క్రీడా వాయిస్**

### మిస్టరీ స్పిన్నర్ దెబ్బకు

## రికార్డులు గల్లంతు..

### ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 ప్లేస్ వరుణ్ చక్రవర్తిదే..



టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ప్రస్తుతం టి20 అంతర్జాతీయ క్రికెట్‌లో తన అద్భుతమైన బౌలింగ్‌తో ప్రపంచ క్రికెట్‌ను ఆకట్టుకుంటున్నాడు. నిలకడగా రాణిస్తున్న అతను, డిసెంబర్ 17న విడుదలైన తాజా ఐసీసీ టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్-1 స్థానాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా తన కెరీర్‌లోనే అత్యుత్తమ రేటింగ్‌ను నమోదు చేసి చరిత్ర సృష్టించాడు. టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ప్రస్తుతం టి20 అంతర్జాతీయ క్రికెట్‌లో తన అద్భుతమైన బౌలింగ్‌తో ప్రపంచ క్రికెట్‌ను ఆకట్టుకుంటున్నాడు. నిలకడగా రాణిస్తున్న అతను, డిసెంబర్ 17న విడుదలైన తాజా ఐసీసీ టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్-1 స్థానాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా తన కెరీర్‌లోనే అత్యుత్తమ రేటింగ్‌ను నమోదు చేసి చరిత్ర సృష్టించాడు. తాజాగా విడుదలైన ఈ జాబితాలో వరుణ్ తన ఖాతాలో 36 రేటింగ్ పాయింట్లను జోడించుకుని, మొత్తం 818 కెరీర్ బెస్ట్ పాయింట్లను సాధించాడు. గత వారం సౌతాఫ్రికాతో జరిగిన రెండు టి20 మ్యాచ్‌లలో ఒక్కో మ్యాచ్‌లో రెండేసి వికెట్లు (మొత్తం 4 వికెట్లు) తీయడం అతను ఈ ఘనత సాధించడానికి దోహదపడింది. 818 రేటింగ్ పాయింట్లతో వరుణ్ చక్రవర్తి ఒక అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. పురుషుల టి20 క్రికెట్ చరిత్రలో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన టాప్-10 బౌలర్ల జాబితాలో చోటు దక్కించుకున్న ఏకైక భారతీయ బౌలర్‌గా వరుణ్ నిలిచాడు. ఈ ఆల్-టైమ్ బెస్ట్ రేటింగ్స్ జాబితాలో అతను ప్రస్తుతం 8వ స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో పాకిస్తాన్ మాజీ పేసర్ ఉమర్ గుల్ 865 రేటింగ్‌తో మొదటి స్థానంలో ఉండగా, వరుణ్ తన ప్రదర్శనతో తబ్రేజ్ షమ్సీ (827), రషీద్ ఖాన్ (828), సునీల్ నరైన్ (832) వంటి దిగ్గజాల సరసన నిలిచాడు. అంతేకాకుండా పాకిస్తాన్ స్టార్ షాదాబ్ ఖాన్ (811), శ్రీలంక స్పిన్నర్ వనిందు హసరంగా (809) కంటే మెరుగైన రేటింగ్‌ను వరుణ్ సొంతం చేసుకున్నాడు.

పురుషుల టి20ఐ క్రికెట్ చరిత్రలో అత్యధిక రేటింగ్ సాధించిన టాప్-10 బౌలర్ల జాబితా ఇదే

ఉమర్ గుల్ (పాకిస్తాన్) - 865 రేటింగ్, శామ్యూల్ బద్రీ (వెస్టిండీస్) -864 రేటింగ్, డేనియల్ వెట్టోరి (న్యూజిలాండ్) - 858 రేటింగ్, సునీల్ నరైన్ (వెస్టిండీస్)- 832 రేటింగ్, రషీద్‌ఖాన్ (ఆఫ్ఘనిస్తాన్) - 828 రేటింగ్, తబ్రేజ్ షమ్సీ (దక్షిణ ఆఫ్రికా)- 827 రేటింగ్, షాహిద్ అఫ్రిది (పాకిస్తాన్) - 822 రేటింగ్, వరుణ్ చక్రవర్తి (భారత్) - 818 రేటింగ్, షాదాబ్ ఖాన్ (పాకిస్తాన్) - 811 రేటింగ్, వనిందు హసరంగా (శ్రీలంక) - 809 రేటింగ్. వరుణ్ చక్రవర్తి ఇప్పుడు తన తదుపరి లక్ష్యంగా పాకిస్తాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది సాధించిన 822 రేటింగ్ పాయింట్లపై దృష్టి సారించాడు. ఈ వారంలో జరగబోయే మ్యాచ్‌లలో గనుక అతను మెరుగైన ప్రదర్శన కొనసాగిస్తే, అఫ్రిదిని అధిగమించి ఆల్-టైమ్ టాప్-10 జాబితాలో 7వ స్థానానికి చేరుకునే అవకాశం ఉంది. ప్రస్తుత ఐసీసీ టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో వరుణ్ 818 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, రెండవ స్థానంలో ఉన్న న్యూజిలాండ్ బౌలర్ జాకబ్ డఫ్ఫీ (699) కంటే 119 పాయింట్ల భారీ ఆధిక్యంలో ఉన్నాడు. ప్రస్తుతం టాప్-10 ర్యాంకింగ్స్‌లో ఉన్న ఏకైక భారతీయ బౌలర్ వరుణ్ మాత్రమే కాగా, సౌతాఫ్రికా సిరీస్‌కు దూరమైన అక్షర్ పటేల్ 636 రేటింగ్‌తో 13వ స్థానంలో కొనసాగుతున్నాడు.

## ఐపీఎల్ వేలంలో తెలుగు కుర్రాళ్ల సత్తా..

### తెనాలి పేసర్‌ను తీసుకున్న గుజరాత్, కరీంనగర్ హిట్టర్‌పై రాజస్థాన్ కన్ను





భారత క్రికెట్ జట్టులో తెలుగు రాష్ట్రాల ఆటగాళ్లు గత కొన్నేళ్లుగా తమదైన ముద్ర వేస్తున్నారు. ప్రస్తుతం టీమిండియాలో కీలక యువ ఆటగాళ్లుగా ఉన్న నితీష్ కుమార్ రెడ్డి, తిలక్ వర్మ వంటివారు కూడా ఐపీఎల్ ద్వారానే తమ సత్తా చాటి, అంతర్జాతీయ స్థాయికి చేరుకున్నారు. భారత క్రికెట్ జట్టులో తెలుగు రాష్ట్రాల ఆటగాళ్లు గత కొన్నేళ్లుగా తమదైన ముద్ర వేస్తున్నారు. ప్రస్తుతం టీమిండియాలో కీలక యువ ఆటగాళ్లుగా ఉన్న నితీష్ కుమార్ రెడ్డి, తిలక్ వర్మ వంటివారు కూడా ఐపీఎల్ ద్వారానే తమ సత్తా చాటి, అంతర్జాతీయ స్థాయికి చేరుకున్నారు. తాజాగా మరో ఇద్దరు తెలుగు యువ ఆటగాళ్లు రాబోయే ఐపీఎల్ సీజన్‌లో మెరవడానికి సిద్ధమయ్యారు. మంగళవారం అబుదాబిలో జరిగిన మినీ-వేలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఒక్కో అన్‌క్యాప్డ్ ఆటగాడిని వేర్వేరు ఫ్రాంచైజీలు వారి బేస్ ప్రైస్కు దక్కించుకున్నాయి.

**గుజరాత్ టైటాన్స్ జట్టులోకి లెఫ్ట్ ఆర్మ్ పేసర్**

ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలికి చెందిన లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ఎర్రా పృథ్వీరాజ్ ను గుజరాత్ టైటాన్స్ రూ.30 లక్షల కనీస ధరతో కొనుగోలు చేసింది. గతంలో పృథ్వీరాజ్ కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ వంటి జట్ల తరఫున ఎంపికయ్యాడు. అయితే, ఆ రెండు జట్లలోనూ అతనికి తుది జట్టులో ఆడే అవకాశం దక్కలేదు. దీంతో ఎక్కువగా బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఇప్పుడు గుజరాత్ టైటాన్స్‌కు ఎంపికైనందున, ప్రధాన పేసర్‌గా ఉన్న రబాడాకు మద్దతుగా లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌గా అతనికి అవకాశం దక్కే ఛాన్స్ ఉంది.

**రాజస్థాన్ రాయల్స్ జట్టులోకి తెలంగాణ హిట్టర్**

తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన 21 ఏళ్ల యువ బ్యాట్స్‌మెన్ పేరాల అమన్ రావును రాజస్థాన్ రాయల్స్ రూ.30 లక్షల కనీస ధరకే దక్కించుకుంది. అమన్ రావుకు ఇది తొలి ఐపీఎల్ సీజన్. ప్రస్తుతం అతను రంజీ స్థాయిలో హైదరాబాద్ అండర్-23 జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇటీవల జరిగిన ముస్తాక్ అలీ టోర్నమెంట్‌లో అతని దూకుడు బ్యాటింగ్ శైలి అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ సిరీస్‌లో రెండు అర్ధ సెంచరీలు చేయడంతో, వేలానికి ముందే ఫ్రాంచైజీల దృష్టి అతనిపై పడింది.

**కెరీర్‌కు కీలకం కానున్న ఐపీఎల్ 2026 సీజన్**

ఈ ఇద్దరు తెలుగు ఆటగాళ్లకు ఐపీఎల్ 2026 సీజన్ అత్యంత కీలకం కానుంది. దేశవ్యాప్తంగా ఎంతో మంది యువకులు ఐపీఎల్‌లో వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని జాతీయ జట్టులో స్థానం సంపాదించారు. అదేవిధంగా పృథ్వీరాజ్, అమన్ రావు కూడా ఈ సీజన్‌లో తమ ప్రతిభను ప్రదర్శించడానికి అవకాశం దొరికితే, అది వారి కెరీర్‌కు ఒక టర్నింగ్ పాయింట్ అవుతుంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైమ్ వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- విద్యా వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com